

వార్త
ఆదివారం
23 నవంబరు, 2025
కళావైభవ దర్పణం
వారసత్వ పరిరక్షణం

# కీలక పాత్రలో శోభన!



మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'పెద్ది'. ఈ చిత్రంలో అలనాటి నటి శోభన ఒక కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ఈ వార్తతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

గతేడాది 'కల్కి 2898 ఏడీ'తో చాలా కాలం తర్వాత తెలుగు తెరపై కనిపించిన శోభన, 'పెద్ది'లో కథను మలుపు తిప్పే పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఆమె పాత్ర సినిమాకు ఎమోషనల్ డెప్త్‌ని ఇస్తుందని చిత్ర వర్గాలు భావిస్తున్నాయి. ఒకప్పుడు మెగాస్టార్ చిరంజీవితో 'రుద్రవీణ', 'రౌడీ అల్లుడు' వంటి చిత్రాల్లో నటించి హిట్ పెయిర్‌గా పేరు తెచ్చుకున్న శోభన, ఇప్పుడు ఆయన తనయుడు రామ్ చరణ్ సినిమాలో నటించనుండటం మెగా అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సినిమాలో రామ్‌చరణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్‌తో అనుబంధం ఉన్న సతీశ్ కిలారు ఈ చిత్రంతో నిర్మాతగా పరిచయమవుతున్నారు. భారీ బడ్జెట్, ఉన్నత సాంకేతికలతో గ్రామీణ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

తారాతీరం

# తిరువీర్, ఐశ్వర్య రాజేష్ జంటగా..

తిరువీర్, ఐశ్వర్య రాజేష్ హీరో, హీరోయిన్లుగా తాజాగా ఓ సినిమా ప్రారంభమైంది. 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో'తో సక్సెస్ సాధించిన తిరువీర్ గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై భరత్ దర్శకత్వంలో ఇప్పుడు ఓ పాన్ సౌత్





ఇండియన్ మూవీలో నటిస్తున్నారు. గతంలో 'టక్ జగదీష్'లో విలన్‌గా నటించిన తిరువీర్ ఈ చిత్రంలో హీరోగా ఐశ్వర్య రాజేష్‌తో కలిసి నటిస్తున్నారు. టాలీవుడ్‌లో వర్సటైల్ యాక్టర్‌గా పేరు తెచ్చుకున్నారు తిరువీర్. కెరీర్ ప్రారంభంలో చిన్న చిన్న సపోర్టింగ్ రోల్స్ చేసిన ఈ నటుడు ఇప్పుడు హీరోగా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంటున్నారు. తాజాగా 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' సినిమాతో మంచి సక్సెస్ సాధించారు. తిరువీర్ తాజాగా తన కొత్త చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా తర్వాత తెలుగులో ఆమె కమిటైన ప్రాజెక్ట్ ఇదే. ఈ సినిమాతో భరత్ దర్శన్ దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. ఈ సినిమాని తెలుగుతో పాటు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది.

ఆదివారం వార్త

23 నవంబరు, 2025

## మంచి ముత్యాలు

– ఈ ప్రపంచం స్వభావం వింతగా ఉంటుంది. మంచి చేసిన వాళ్లనే అది ముంచుతుంది. – గాలిబ్

– ప్రతి మనిషికా కావలసింది ప్రశంసలే. – అబ్రహం లింకన్

## కదంబం


'సంఘీ'భావం....5

గంజాయి సేవిస్తే విద్యార్థులపై కేసులు

కవర్ స్టోరీ..6

కళావైభవ దర్పణం వారసత్వ పరిరక్షణం

ఈ వారం కవిత్వం...12

కాల నృత్యం

కథ..20

గమనం గాడి తప్పాక..

శ్రీకృష్ణుడు నడయాడిన 'కళ్ళుత్తిపర'... 28

ఇంకా...

ముగ్గ

వాస్తు

వారఫలం

వగైరా.. వగైరా..


# సమాచారం

## ప్రతి ఇరవై యేళ్లకు ఒకసారి..



జపాన్‌లోని అత్యంత పవిత్రమైన మందిరాల్లో ఇసె జింగు ప్రాంతంలో ఉన్న మందిరం కూడా ఒకటి. దీనిని ప్రతి ఇరవై యేళ్లకు ఒకసారి కూలగొట్టి మళ్లీ నిర్మిస్తారు. దీనిని 'షికినేన్ సెగు' అని అంటారు. ఈ మందిరం ఎప్పుడూ నిత్యనూతనంగా వుండాలని, పురాతన నిర్మాణ పద్ధతులను కొత్త తరానికి అందించాలన్న ఉద్దేశంతో పదమూడు వందల యేళ్ళ క్రితం ఈ సంప్రదాయాన్ని మొదలు పెట్టారు. సుమారు తొమ్మిది యేళ్ల పాటు నూటా ఇరవై ఐదు భవనాలను, ఆ భవనాల్లో వుండే వస్తువులు మొదలైన వాటిని చేతితో తయారు చేస్తారు. ఇందుకుగాను సుమారు నలభై కోట్ల డాలర్లు ఖర్చు అవుతుందట. ప్రస్తుతం అరవై మూడోసారి మందిరాన్ని నిర్మిస్తున్నట్లు సమాచారం. నిర్మాణం పూర్తయ్యేలోపల ముప్ఫై మూడు పండుగలు, ఆచారాలు మొదలైనవి జరుపుకుంటారు. 2033లో కొత్త మందిరంలోకి ప్రధాన దేవతను చేర్చడంతో ఈ ప్రక్రియ పూర్తవుతుంది. ఇసుజు నది ఒడ్డున ఉన్న ఈ మందిరంలో సూర్యదేవత అమతెరాసు కొలువై ఉంది.

## గిటార్ ఆకారంలో అడవి

అర్జెంటీనాకు చెందిన ఒక రైతు తన భార్య జ్ఞాపకార్థం ఆమెకు ఇష్టమైన గిటార్ ఆకృతిలో ఒక అడవిని పెంచాడు. నలభై సంవత్సరాలుగా ఈ అడవిని కాపాడుకుంటున్నాడు. విమానంలోని చూసేవాళ్లకు, శాటిలైట్లు తీసే చిత్రాల్లోనూ గిటార్‌ను పోలిన ఈ అడవి కంటికింపుగా కనిపిస్తోంది.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.

sunmagvaartha@gmail.com




## సాఫ్ట్‌వేర్–ఫుట్‌వేర్

“మీ పెద్దబ్బాయి సాఫ్ట్‌వేర్ అన్నారు. మరి రెండో అబ్బాయి ఏం చేస్తున్నాడు?” అడిగాడు అప్పారావు, పాపారావుని.

“ఫుట్‌వేర్” అన్నాడు పాపారావు.

“అంటే?” అర్థంగాక అన్నాడు పాపారావు.

“చెప్పుల దుకాణం నడుపుతున్నాడు” సమాధానమిచ్చాడు పాపారావు.

పాపారావు చమత్కారానికి అప్పారావుకు నవ్వులే నవ్వులు.

**– టి.సదాశివరెడ్డి**

## భోజనం చేస్తాగా..

పోలీస్: నువ్వు ఆ గుడిలోని హుండీలో డబ్బులు మొత్తం దొంగతనం చెయ్యకుండా సగం తీసుకుని సగం వదిలేసావు, కారణం?

దొంగ: ఆ గుడిలో వారం వారం అన్నదానం చేస్తారు.. నేను కూడా వెళ్తూ ఉంటాను.. ఉపయోగపడతాయని సగం వదిలేసాను..!

పోలీస్: ఆ....!?!?

## హోటల్ భోజనం పడదు

పోలీస్: “నువ్వు ఆ ఇంట్లో చాలా డబ్బు, బంగారం దొంగతనం చేసావు కదా.. వెళ్ళేటప్పుడు అక్కడే భోజనం చేస్తూ దొరికిపోయావు.. ఫుడ్‌ని కూడా వదలవా?” అడిగాడు.

దొంగ: “అలా ఏం కాదు.. నాకు హోటల్ ఫుడ్ పడదు..!” తెలివిగా సమాధానమిచ్చాడు.

## చొక్కాలుండవుగా!

పోలీస్: “నువ్వు దొంగతనం చేయడానికి ఇంట్లోకి వెళ్ళినప్పుడు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యింది”

దొంగ: “ఆ వీడియోలో ఉంది నేను కాదు.. మనుషులని పోలిన మనుషులు ఉంటారు కదా..?”

పోలీస్: “మనుషులని పోలిన మనుషులు ఉంటారు.. కానీ చొక్కాలని పోలిన చొక్కాలు ఉండవు కదా..?” సమాధానమిచ్చాడు.

## లెంపకాయలు

టీచర్: కాయలు పండ్లు మార్కెట్‌లో దొరుకుతాయి కదా.. క్లాస్‌లో కూడా దొరుకుతాయి అంటావు ఏంటి? ఇక్కడ కాయలు ఏమీ లేవు కదా..?

స్టూడెంట్: క్లాస్‌లో కూడా దొరుకుతాయి టీచర్.. లెంప కాయలు..!



## కళ్లజోడు లేనందువల్ల..

టీచర్: యాభై మార్కుల కంటే తక్కువ వచ్చిన వాళ్ళను నిల్చోమన్నాను కదా.. నువ్వు నిలబడలేదు ఏంటి?

స్టూడెంట్: కళ్ళజోడు ఇంట్లో మర్చి పోయాను. పేపర్ మీద మార్కులు కనపడలేదు.

## దొంగనోట్లు

అప్పారావు: “మీకు ఒక సజెషన్ ఇస్తాను.. తీసుకుంటారా?”

క్యాషియర్: “ఏంటి?”

అప్పారావు: “చినిగిన నోట్లు తీసుకుంటామని గోడకు పేపర్ అతికించారు కదా.. దొంగ నోట్లు కూడా తీసుకుంటామని అంటే ఇంకా బాగుంటది” అని నా అభిప్రాయం.

## బోరింగ్ వాటర్

కస్టమర్: “నిన్న పాలు చండాలంగా ఉన్నాయి. నేను టీ పెట్టిన వెంటనే విరిగిపోయాయి..”

పాలవాడు: “క్షమించండి.. రోజూ మినరల్ వాటరే కలిపేవాడ్ని. నిన్న మాత్రం బోరింగ్ వాటర్ కలిపాను..!”

## ఇన్సూరెన్సు ఉంది

ఫస్ట్ ఆఫీసర్: “ఇంజన్‌లో ప్రాబ్లం వచ్చింది.. కూలిపోవడం ఖాయం.. నేను చనిపోతే నా కుటుంబం రోడ్డున పడుతుంది”

పైలట్: “నాకు ఆ బాధ లేదు”

ఫస్ట్ ఆఫీసర్: “ఎందుకు?”

పైలట్: “నెల కిందటే నేను భారీగా ఇన్సూరెన్స్ చేయించాను..!”

## నిలబడే ఉంటాడు

జడ్జి: “ఎందుకు ఇలా విడాకులు తీసుకోవడం? ఇద్దరూ కూర్చొని మాట్లాడుకుంటే సమస్య పరిష్కారం అవుతుంది కదా..?”

భార్య: “ఇతను ఎప్పుడూ నిలబడే మాట్లాడుతాడు.. కూర్చొని మాట్లాడడు..!”

**– ఎస్ కె.యాకూబ్ పాషా**

## వంట

విజ్జి: “నిన్న మా ఆయనకు ఒక మాట చెప్పాను. వెంటనే ఆయన స్పృహ తప్పి పడిపోయాడు”

గీత: “విడాకులు ఇస్తానని చెప్పావా ఏంటి?”

విజ్జి: “అదేమీ కాదు, ఈరోజు వంట నేను చేస్తానని చెప్పాను. అంతే!”

## నాదే..!

సెక్యూరిటీ: “ఇతరుల కారు ఇక్కడ పార్కింగ్ చేయకూడదు”

కస్టమర్: “ఈ కారు నాదే సార్, ఇతరులది కాదు”

**– ఈ.ఎస్.మాధవన్**

## 'సంఘీ' భావం



# గంజాయి సేవిస్తే విద్యార్థులపై కేసులు

కరోనా వచ్చిన తరువాత తెలుగు రాష్ట్రాల్లో గంజాయి అమ్మకాలు జోరందుకున్నాయి. ఉపాధి కోల్పోయిన యువత అడ్డదారిలో డబ్బు సంపాదించేందుకు గంజాయి అమ్మకాలపై దృష్టిసారించారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి సాగును అడ్డుకునే చర్యలు ఆశించినంత మేరకు లేకపోవడంతో ఏజెన్సీ ప్రాంతాలతో పాటు కొన్ని తోటల్లో కూడా గంజాయిని సాగుచేయడం ప్రారంభించారు. ఆంధ్రలో పండించిన గంజాయి దేశంలోని వివిధ రాష్ట్రాలకు సరఫరా కావడంతో పోలీసులు ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల వద్ద గస్తీ ముమ్మరం చేశారు. అయితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో మాత్రం గంజాయి అమ్మకాలు జోరుగానే సాగుతున్నాయి. ముఖ్యంగా యువతతో పాటు విద్యార్థులు గంజాయి సేవించి బానిసలుగా మారుతున్నారు. గంజాయిని వివిధ రూపాల్లో విద్యాసంస్థలకు సరఫరా చేస్తున్నారు. పౌడర్‌గాను, చాక్లెట్లుగాను తయారు చేస్తున్నారు. అదేవిధంగా కొన్ని ప్రాంతాల్లో ఐస్‌క్రీమ్‌లలో గంజాయి పౌడర్‌ను కలిపి విక్రయిస్తున్నారు. సరదాగా గంజాయిని సేవించిన విద్యార్థులు క్రమంగా బానిసలుగా మారుతున్నారు. శంషాబాద్ సమీపంలోని ఒక విద్యాసంస్థలో విద్యార్థులు మత్తులో ఉన్నట్లు గమనించిన ఉపాధ్యాయులు పోలీసులను ఆశ్రయించడంతో ఆ పాఠశాలకు సమీపంలోని ఒక కిరాణా షాపులో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ చాక్లెట్ల గంజాయి అమ్మకాలు హైదరాబాద్‌లో జోరుగా సాగుతోంది. విద్యార్థులకు తెలిసి కూడా గంజాయి సేవించడానికి మొగ్గుచూపించడంతో వారిపై కూడా చర్యలు తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారు. దీనివల్ల గంజాయి సేవించడానికి విద్యార్థులు భయపడతారని పోలీసులు భావిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ప్రస్తుతం గంజాయి రవాణాను అరికట్టడానికి అనేక బృందాలు ఏర్పాటు చేశారు. తెలంగాణలో ఈగల్ టీమ్ గంజాయిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ సమయంలో ఎక్కువగా హైస్కూలు, కళాశాలలు, ఇంజనీరింగ్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు గంజాయి సేవిస్తున్నారని గుర్తించారు. అప్పటి నుంచి అనేక విద్యాసంస్థల్లో సదస్సులు ఏర్పాటు చేసి గంజాయి వల్ల కలిగే అనర్థాలతో పాటు విక్రయిస్తూగానీ, సేవిస్తూగానీ పట్టుపడితే చట్టపరంగా తీసుకునే చర్యల గురించి కూడా వివరిస్తున్నారు. ఒక్కసారి గంజాయి కేసులో అరెస్ట్ అయితే భవిష్యత్తు అంధకారంగా మారుతుందని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తాజాగా బేగంపేట్‌లోని ఒక కాలేజీలో హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు గంజాయి సేవిస్తూ దొరికారు. విచారణలో ఈ కాలేజీకి చెందిన మొత్తం గత పదకొండు మంది గంజాయికి అలవాటు పడ్డారని తేలింది. పదకొండు మందికి డ్రగ్స్ టెస్టు కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించడంతో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. ఈ పరీక్షలను ఈగల్ అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులు, కాలేజీ నిర్వాహకుల ముందు నిర్వహించారు. ఈ ఆరుగురు విద్యార్థులను డీ అడిక్షన్ కేంద్రానికి తరలించారు. ఒక బర్త్‌డే పార్టీలో ఈ విద్యార్థులు గంజాయి సేవించినట్లు దర్యాప్తులో బయటపడింది. వీరికి ఎస్ఆర్ నగర్ ప్రాంతానికి చెందిన జేసన్, అరిక్ జో నాథన్, లాయ్ తదితరులు గంజాయి సరఫరా చేస్తున్నట్లు ఈగల్ అధికారులు గుర్తించారు. వీరిని అరెస్టు చేయడంతో పాటు గంజాయి సేవించిన విద్యార్థులను కూడా ఈగల్ అధికారులు అరెస్టు చేశారు. గతంలోనూ ఈ కాలేజీకి చెందిన కొంత మంది విద్యార్థులు దొరికారని, కాలేజీ నిర్వాహకులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఈగల్ అధికారులు పేర్కొన్నారు. మరోసారి ఈ నిర్లక్ష్యం కొనసాగితే కాలేజీ నిర్వాహకులపై కూడా చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

విద్యార్థులు మత్తు పదార్థాలు సేవిస్తూ చిక్కితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, వారు డీ అడిక్షన్ కేంద్రాలకు వెళ్లిన తర్వాత కొన్ని రోజుల పాటు ఈగల్ అధికారుల మానిటరింగ్ ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అదేవిధంగా పలుమార్లు ఆకస్మిక తనిఖీలతో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షల్లో మత్తు పదార్థాలు తీసుకోలేదని తేలితే, మరోసారి వాటి జోలికి వెళ్లరని నమ్మకం కలిగితే అప్పుడు వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని క్రిమినల్ కేసు విత్‌డ్రా చేసుకుంటామని ఈగల్ టీమ్ వివరించింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో తనిఖీలు నిర్వహించి డ్రగ్‌కిట్స్ ద్వారా పరీక్షలు నిర్వహించడానికి రంగం సిద్ధం చేశారు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

రుద్రరాజు శ్రీనివాసరాజు



# కళావైభవ దర్పణం వారసత్వ పరిరక్షణం

యునెస్కో వరల్డ్ హెరిటేజ్ కన్వెన్షన్ ద్వారా ప్రపంచంలోని ముఖ్యమైన ప్రకృతి, సాంస్కృతిక స్థలాలను 1972 నుండి ప్రపంచ వారసత్వ సంపదలుగా గుర్తించే ప్రక్రియ ప్రారంభించింది. భారతదేశం 1977లో ఈ ఒప్పందానికి సంతకం చేసింది. అప్పటి నుండి భారత ప్రభుత్వం పురావస్తు సర్వే ఆఫ్ ఇండియా ద్వారా ఈ వారసత్వ స్థలాల సంరక్షణ, ప్రచారం, అవగాహన కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుంది. దానిలో భాగంగా యునెస్కో ప్రపంచ వారసత్వ సూత్రాలకు ప్రేరణగా తీసుకుని, భారత ప్రభుత్వంలోని పురావస్తు శాఖ ప్రతి సంవత్సరం నవంబర్ 19 నుండి 25 వరకు ఒక జాతీయ స్థాయి వారోత్సవం నిర్వహిస్తున్న సందర్భంలో ప్రపంచ వారసత్వ సంపదపై ఈ వారం ప్రత్యేక కథనం.

## వరసగా వచ్చేదే వారసత్వం

ముందు తరాలవారు అందించింది, ఇప్పటి తరం అందుకుని, రేపటి తరం అందుకోబోయేదే వారసత్వం. ఒక తరం నుంచి మరో తరానికి సంక్రమించే అనేక సముదాయాల సమాహారమే వారసత్వ సంపదగా చెప్పవచ్చు. ఈ సముదాయాల సమాహారం అనేది భావజాలరూపంలో ఉండొచ్చు. నాగరికత, సంస్కృతి, అలవాట్ల వంటి జీవనవిధాన రూపంలో ఉండొచ్చు. భౌతిక రూపాలైన మానవ నిర్మిత కట్టడాలు, దేవాలయాలు, ఆనకట్టలు, నగర నిర్మాణ పద్ధతులు, ఉద్యానవనాలతో పాటు ప్రకృతిలో సహజ సిద్ధంగా ఏర్పడిన కళాత్మక నిర్మాణాల రూపంలో కూడా ఉండవచ్చు. ఈ వారసత్వ సంపదను కనిపించే వారసత్వం, కనిపించని వారసత్వం అని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. వీటిలో ప్రాకృతిక వనరులు, వాటి సౌందర్యం, కొండకోనలు, వాగులు వంకల నుంచి ఎడారులు చారిత్రక స్థలాలు, కట్టడాలు, కళాఖండాలు అనేవి కనిపించే వర్గంలోకి వస్తాయి. "పాడితేనే వినిపించే పాట, ఆడితేనే కనిపించే ఆట, ప్రదర్శిస్తేనే గానీ చూడలేని నాటకం, నృత్యం, ఇంద్రజాలం పండుగలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు వంటివి కనిపించని వారసత్వ విభాగంలోనికి వస్తాయి. పూర్వీకుల నుంచి మనకు లభించిన ఈ ఘనమైన వారసత్వం అనేది కేవలం ఒక చరిత్ర కాదు, ఇదొక శాస్త్రం, వివిధ వర్గాల ప్రజలను కలిపే వారధిగా చెప్పాలి. అంతేకాదు వారసత్వ సంపద కృత్రిమ సరిహద్దుల్ని చెరిపి, వసుధైక కుటుంబమన్న భావనను పెంపొందించే మొత్తం మానవాళి ఉమ్మడి భాగస్వామ్య స్పృహ" ఇది గత వైభవ ప్రాభవాలను నేటి తరానికి జ్ఞప్తికి తీసుకువచ్చి భవిష్యత్తుకు బాటలు వేస్తుంది.

వారసత్వం కేవలం రాళ్ళు, లిపి లేదా శిథిలాలతో నిర్మించబడలేదు. ఇది ఆలయ గోడలోని ప్రతి గుసగుసలో, పురాతన కోటలపై చెక్కబడిన ప్రతి శిల్పంలో, తరతరాలుగా అందించబడిన ప్రతి జానపద పాటలో నివసిస్తుంది. ఇది మనం ఎవరో, మనం దేని కోసం నిలబడ్డామో, మనం ఎలా సహించామో కథలను చెబుతుంది. ఒక దేశ గొప్పతనం, నాగరికత, సంస్కృతి, సాంప్రదాయాలు అన్నీ ఈ వారసత్వ సంపద ద్వారానే భావితరాల వారికి వారధిగా ఉంటుంది. వారసత్వ సంపద కేవలం ఒక దేశానికో, ప్రాంతానికో పరిమితం కాదు. మానవ నాగరికతకు, ప్రకృతి అద్భుతాలకు నిలువెత్తు సాక్ష్యమే ఈ ప్రపంచ వారసత్వ సంపద. యావత్ మానవాళి ఉమ్మడి సంపదైన దీనిని ముందు తరం పెద్దలు అయాచితంగా ఎంతో గొప్పదైన ఈ వారసత్వ సంపదను మనకు అందించారు.

మన దేశం నవంబర్ 14, 1977లో ఈ వరల్డ్ హెరిటేజ్ కన్వెన్షన్‌లో భాగస్వామ్యం అయింది. యునెస్కో 1972లో రూపొందించిన వరల్డ్ హెరిటేజ్ కన్వెన్షన్ ప్రకారం "మానవ చరిత్ర, సంస్కృతి, శాస్త్రం/ప్రకృతి వైభవానికి ప్రతీకగా నిలిచే స్థలాలు, నిర్మాణాలు, ప్రకృతి దృశ్యాలు లేదా జీవ వ్యవస్థలు వీటినే ప్రపంచ వారసత్వ సంపదలు" అంటారు. వీటిని భావితరాలకు అందించడం ప్రతి దేశం బాధ్యతగా యునెస్కో నిర్దేశిస్తుంది.

అంతర్జాతీయ స్థాయి గల వాటిని యునెస్కో ఆధ్వర్యం లోని ప్రపంచ వారసత్వ కేంద్రం ప్రాంతీయంగా చారిత్రక

ప్రాధాన్యం స్థలాలు, కట్టడాలు, కళాఖండాలను రాష్ట్ర పురావస్తు శాఖ, జాతీయ స్థాయిలో ప్రాధాన్యతగల వాటిని కేంద్ర పురావస్తు శాఖ పరిరక్షిస్తున్నాయి. వీటితో పాటు ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వేతర, స్వచ్ఛంద సంస్థలు కొన్ని ప్రముఖమైన కట్టడాలను దత్తత తీసుకొని వారసత్వ పరిరక్షణలో పాలుపంచుకొంటున్నాయి. ఈ క్రమంలో

ప్రపంచ వారసత్వ సంపదను గుర్తించడానికి ప్రపంచ వారసత్వ సంపద మూడు వర్గాలుగా విభజించారు.

**1) సాంస్కృతిక సంపద:** ఇవి మానవులచే సృష్టించబడిన చారిత్రక, కళాత్మక, నిర్మాణ ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాలు. ఉదా: తాజ్‌మహల్, ఖజురహో ఆలయాలు, రామప్ప ఆలయం. **2) సహజ సంపద:** ప్రకృతిలో సహజంగా ఏర్పడిన విశిష్టమైన ప్రదేశాలు.

ఉదా: హిమాలయ పర్వతాలు, పగడపు దిబ్బలు.

**3) మిశ్రమ సంపద:** ఇవి సాంస్కృతిక, సహజ లక్షణాలు రెండూ కలిగిన ప్రదేశాలు. ఉదా: ఖాంగ్‌చెండ్‌జోంగా జాతీయ ఉద్యానవనం. ప్రపంచంలో ఒక ప్రదేశాన్ని వారసత్వ సంపదగా గుర్తించడానికి యునెస్కో పది ప్రమాణాలను పేర్కొన్నది. అవి: అత్యుత్తమ సార్వత్రిక విలువ కలిగి ఉండాలి. ఈ విలువను నిరూపించడానికి యునెస్కో పేర్కొన్న పది ప్రమాణాలలో–

– మానవ సృజనాత్మక ప్రతిభకు నిదర్శనంగా ఉండాలి.

– చారిత్రక కాలంలోని మానవ విలువలు, సాంస్కృతిక అభివృద్ధికి సాక్ష్యంగా నిలవాలి.

– ప్రత్యేకం లేదా అసాధారణమైన సాంస్కృతిక సంప్రదాయం/ నాగరికతకు ప్రాతినిధ్యం వహించాలి.

– అద్భుతమైన సహజ దృగ్విషయం లేదా సహజ సౌందర్యం, సౌందర్య ప్రాముఖ్యత కలిగి ఉండాలి.

– జీవ వైవిధ్య సంరక్షణకు అత్యంత ముఖ్యమైన సహజ ఆవాసాలను కలిగి ఉండాలి.

మొత్తం మీద సాంస్కృతిక అంశాలలో 6, సహజ అంశాలలో 4. వీటిలో కనీసం ఒకదానినైనా సంతృప్తిపరచాలి. ఈ విధంగా గుర్తించిన వారసత్వ సంపద పరిరక్షణ, అవగాహన కలిగించడానికి యునెస్కో అపారమైన కృషి చేస్తోంది. వివిధ దేశాలలో గుర్తించిన పురాతన కట్టడాలు, స్థలాల పరిరక్షణ కోసం యునెస్కో సభ్యదేశాల మధ్య పరస్పర ఆర్థిక, సాంకేతిక విషయాలలో సహకరించుకోవడం, ఆయా దేశాల్లోని ప్రజలకు వీటిపట్ల అవగాహన కలిగించడం ప్రధాన లక్ష్యంగా ఏప్రిల్ 18న 'ప్రపంచ వారసత్వ సంపద దినోత్సవం' జరుపుతూ ఉంది. దీనిని స్ఫూర్తిగా తీసుకుని మన దేశం ప్రతి సం॥ నవంబర్ 19–25 వరకు వారసత్వ వారోత్సవాన్ని జరపడం ఆరంభించింది.



## ప్రపంచ వారసత్వ వారోత్సవం

ఈ వారం మొత్తం పురావస్తు శాఖలు, మ్యూజియాలు, పాఠశాలలు, కళాశాలలు కలిసి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి. ఇది కేవలం రాతి దేవాలయాల గురించి, రాజభవనాల గురించి లేదా పురాతన నగరాల గురించి మాత్రమే కాదు, మన ఆత్మను, చరిత్రను, సంస్కృతిని నిలుపుకునే వారసత్వ విలువల పండుగ. భారతదేశంలో ప్రస్తుత, భవిష్యత్ తరాల ప్రయోజనం కోసం భారతదేశ ప్రత్యేక వారసత్వాన్ని ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం చేపట్టే ప్రచార కార్యకలాపాలలో ఈ వారసత్వ వారోత్సవం ఒక భాగం. వారం రోజుల పాటు జరిగే ఈ వేడుక సంస్కృతిచ, సంప్రదాయాల ప్రాముఖ్యత, వాటిని రక్షించాల్సిన అవసరం గురించి అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది భారతదేశానికి మాత్రమే సంబంధించినది తప్ప అంతర్జాతీయ దినోత్సవం కాదు. అంతర్జాతీయంగా ఏప్రిల్ 18 ప్రపంచ వారసత్వ దినోత్సవంగా గుర్తించబడింది.

భారతదేశంలోని ప్రపంచ వారసత్వ స్థలాలు, పురాతన స్మారకాలు, కళా సంపదలను సంరక్షించాల్సిన అవశ్యకతపై విద్యార్థులు, పర్యాటకులు, స్థానిక ప్రజలలో సాంస్కృతిక వారసత్వంపై ఆసక్తి, అవగాహన కల్పించడం. వారసత్వం కేవలం చిహ్నాలు గానే కాకుండా మన జీవితం సామాజిక గుర్తింపుకు మూలమైనదనే భావన ప్రజల్లో నింపడం విలువైన సంపదల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడం ప్రధాన లక్ష్యంగా ఉంది.

**వారోత్సవం లక్ష్యాలు:** 1. భారతదేశంలోని సాంస్కృతిక, చారిత్రక, ప్రకృతిసంబంధ వారసత్వాల ప్రాముఖ్యతను గుర్తుచేయడం. 2. ప్రజల్లో వారసత్వ సంరక్షణపట్ల చైతన్యం కల్పించడం. 3. యువతలో చారిత్రక అవగాహన, సాంస్కృతిక గౌరవం పెంచడం. 4. పర్యాటక రంగానికి ఉత్సాహం కల్పించడం.

వారోత్సవంలో భారతదేశంలోని వివిధ రాష్ట్రాల పురావస్తు శాఖలు, మ్యూజియంలు, వారసత్వ స్థలాలపై అవగాహన కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి; విద్యార్థుల కోసం క్విజ్, చిత్రలేఖన పోటీలు, హెరిటేజ్ వాక్‌లు, ఫోటో ప్రదర్శనలు, డాక్యుమెంటరీ ప్రదర్శనలు, లెక్చర్లు, వర్క్‌షాప్‌లు, స్థానిక ప్రజలతో చర్చా కార్యక్రమాలు, పర్యాటకుల కోసం ప్రత్యేక గైడ్ టూర్లు నిర్వహిస్తారు. ఈ వారోత్సవం ద్వారా ప్రజలకు వీటి విలువ, సంరక్షణ అవసరం, పర్యాటక ప్రాధాన్యం అర్థమవుతుంది.

మన భౌగోళిక వారసత్వం గురించి అందరికీ అవగాహన

అవసరం. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ప్రదేశాలను సంరక్షించుకోవడం మన తక్షణ బాధ్యత. అందుచేత ఈ సంపదపై అవగాహన కోసమే ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.



యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు వలన ఆ సంపదలకు, దేశానికి కలిగే ప్రయోజనాలు:

**1) అంతర్జాతీయ గుర్తింపు:** ఆ ప్రదేశానికి ప్రపంచ వ్యాప్తంగా విశేష గుర్తింపు లభిస్తుంది. 2) ఆర్థిక సహాయం (నిధులు): ప్రపంచ వారసత్వ నిధి ద్వారా వచ్చే ఆర్థిక వనరులు సాంకేతిక సహాయం పొందే అవకాశం లభిస్తుంది, ఇది పునరుద్ధరణ, నిర్వహణ, పరిరక్షణకు ఉపయోగపడుతుంది. **3) పరిరక్షణ మెరుగుదల:** అంత ర్జాతీయ నిపుణుల మార్గదర్శకత్వంలో మెరుగైన పరిరక్షణ ప్రమాణాలు అమలు చేయబడతాయి. **4) పర్యాటక అభివృద్ధి:** అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది, తద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు, ఉపాధికి సహాయపడుతుంది. **5) భవిష్యత్ తరాలకు రక్షణ:** ఈ అపురూపమైన సంపదను భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించడానికి అంతర్జాతీయ నిబద్ధత లభిస్తుంది. **6) జాతీయ గౌరవం:** ఇది దేశ సాంస్కృతిక, చారిత్రక గొప్పతనానికి ప్రతీకగా నిలుస్తుంది. వారసత్వ సంరక్షణ కేవలం సంస్కృతిని కాపాడడమే కాదు, ఆర్థికాభివృద్ధికి కూడా దోహదం చేస్తుంది. భారతదేశంలో పర్యాటక రంగంలో నలభై వరకు వారసత్వ పర్యాటకం పాత్ర ఉంది. హంపి, ఖజురాహో, రామప్ప వంటి ప్రదేశాలు స్థానిక ప్రజలకు ఉపాధి మార్గాలు అందిస్తున్నాయి.

## యునెస్కో గుర్తింపు

సెప్టెంబర్ 2024 నాటికి 170 దేశాల్లో 952 సాంస్కృతిక, 281 ప్రాకృతిక, రెండూ కలిపి మొత్తం 1223 వారసత్వ స్థలాలు, కట్టడాలను యునెస్కో గుర్తించింది. వీటిలో 58 ప్రపంచ వారసత్వ సంపదలతో ఇటలీ మొదటి స్థానంలో ఉండగా– చైనా 56, జర్మనీ 51, ఫ్రాన్స్ 48, స్వీడన్ 49, మన భారత్ 44 వారసత్వ సంపదలతో తులతూగుతోంది. వీటిలో 36 సాంస్కృతిక ప్రదేశాలు కాగా 7 సహజ ప్రదేశాలు 1 మిశ్రమ ప్రదేశం ఉంది. 2021లో ప్రకటించిన తెలంగాణలోని రామప్ప దేవాలయం, గుజరాత్‌లోని డోలవీర ప్రకటన ద్వారా మన దేశం 44 వారసత్వ ప్రదేశాలు మైలురాయి చేరింది. వారసత్వ ప్రదేశాలు మొత్తం మన దేశంలో 19 రాష్ట్రాల్లో విస్తరించి ఉండగా, ఎక్కువగా మహారాష్ట్రలో ఉన్నాయి. భారతదేశంలో ప్రముఖ వారసత్వ సంపదలలో..

**తాజ్ మహల్:** ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ప్రేమకు చిహ్నంగా షాజహాన్ నిర్మించిన తాజ్ మహల్ ఉంది. దీనిని మొఘల్ నిర్మాణ శైలికి అద్భుతమైన ఉదాహరణగా చెప్పవచ్చు. దీనిని 1983 సంలో యునెస్కో జాబితాలో చేర్చడం జరిగింది.

**అజంతా గుహలు:** మహారాష్ట్రలో క్రీ.పూ.2వ శతాబ్దం నుండి క్రీ.శ. 5వ శతాబ్దం వరకు ఉన్న బౌద్ధ రాతితో చెక్కబడిన అజంతా గుహలు 1983 సం॥లో జాబితాలో చేర్చబడింది.

**బృహదీశ్వరాలయం:** చోళుల కాలంలో రూపుదిద్దుకున్న ఈ ఆలయం తంజావూరులోని కావేరి నది ఒడ్డున కొలువైంది. వాస్తు శాస్త్రాన్ని అనుసరించి కట్టిన ఈ ఆలయానికి వెయ్యేళ్ల దాటినా ఇప్పటికీ చెక్కుచెదరలేదు.

**ఐరావతేశ్వర దేవాలయం:** కుంభకోణం దగ్గరలో ఉన్న దారాసురంలో కొలువైన ఐరావతేశ్వర దేవాలయానికి ప్రపంచ వారసత్వ జాబితాలో యునెస్కో చోటిచ్చింది.

**మహాబలిపురం:** తమిళనాడులోని చెంగల్‌పట్టు జిల్లాలో ఉన్న మహాబలిపురం పల్లవరాజుల ఘన చరిత్రకూ కళా వైభవానికీ తార్కాణం. 1984లో యునెస్కో దీనిని ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది.

**మహాబోధి ఆలయం:** బీహార్ రాజధాని పాట్నాకి 115 కి.మీ. గయ జిల్లాలో ఉంది మహాబోధి ఆలయం. క్రీ.పూ.3వ శతాబ్దంలో అశోకుడు ఈ గుడిని కట్టించాడని చెబుతారు. ఆ తర్వాత క్రీ.శ.5,6 శతాబ్దాల్లో గుప్తులు దీన్ని పునర్నిర్మించారు. ఇన్ని శతాబ్దాలైనా చెక్కుచెదరక పోవడం ఈ ఆలయ నిర్మాణంలోని గొప్పదనం. మన దేశంలో యునెస్కో గుర్తింపు పొందిన వారసత్వ కట్టడాల్లో అన్నిటికన్నా పాతదీ, క్రీ.పూ. చెందిన ఆలయం ఇదొక్కటే.

**కోణార్క్:** అద్భుతమైన శిల్పకళా వైభవానికీ ఆకట్టుకునే కళింగ వాస్తు నిర్మాణ శైలికీ ప్రతీకగా నిలిచే కోణార్క సూర్యదేవాలయం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌కి 60 కి.మీ.ల దూరంలో ఉంటుంది.

**హంపి:** సుమారు 41.5 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన ఆనాటి శిథిలాలన్నీ అలనాటి శిల్పకళా వైభవానికీ వాస్తు నిర్మాణానికీ అద్దం పడుతుంటాయి. అందుకే యునెస్కో 1986లోనే హంపిలో శిథిలావస్థలో ఉన్న వందలాది నిర్మాణాల్నీ, దేవాలయాల్నీ ప్రపంచ వారసత్వ సంపద జాబితాలోకి చేర్చింది.

**ఖజురహో:** మధ్యప్రదేశ్‌లోని వింధ్యపర్వతాల మధ్యన ఉండే ఖజురహో ఆలయాల సమూహం క్రీ.శ.950–1050 మధ్య కాలానికి చెందిన నిర్మాణం. చందేల రాజవంశీయులు నిర్మించిన ఈ దేవాలయాలపైన అద్భుత శిల్పకళ దర్శనమిస్తుంది.

**రామప్ప:** భిన్న శైలి, శిల్పకళా వైభవం, టెక్నాలజీ తదితర ఎన్నో అరుదైన అద్భుతాలు ఉండటం వల్ల 2020 సం॥కి ప్రపంచ స్థాయి కట్టడంగా రామప్ప దేవాలయాన్ని యునెస్కో గుర్తించింది. తెలుగు నేలపై యునెస్కో



గుర్తింపు పొందిన మొదటి చారిత్రక కట్టడంగా రామప్ప నిలిచింది. రామప్ప తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచానికి చాటింది.

**ధోలవీర:** గుజరాత్ రాష్ట్రం కచ్ జిల్లాలో ఉన్న హరప్పా నాగరికత కాలం నాటి నగరం ధోలవీర ప్రపంచ వారసత్వ సంపదగా 2021లో యునెస్కో ప్రకటించింది.

**ఎల్లోరా గుహలు:** మహారాష్ట్రలోని సహ్యాద్రి కొండల్లో ఎల్లోరా గుహలు ఉన్నాయి. రాతితో మలిచిన ఈ గుహలు ప్రపంచ ప్రసిద్ధిగాంచాయి.

**ఎలిఫెంటా గుహలు:** ఎలిఫెంటా గుహలు హిందూ, బౌద్ధ మతస్తుల గుహలు. ఇవి ముంబైకి సమీపంలో అరేబియా సముద్రంలో ఉన్న ఎలిఫెంటా అనే దీవిలో ఉన్నాయి. ఈ గుహలు సుమారు 5 నుంచి 8వ శతాబ్దం నాటివి. వీటిని యునెస్కో 1987లో వారసత్వ ప్రదేశ గుర్తింపునిచ్చింది.

**హిల్ ఫోర్ట్స్:** రాజస్థాన్‌లోని ఆరావళి పర్వత శ్రేణుల్లో ఉన్న కొన్ని హిల్‌ఫోర్ట్స్‌కు ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా గుర్తింపు లభించింది.

**జంతర్ మంతర్:** రాజస్థాన్ రాష్ట్ర రాజధాని జైపూర్‌లోని చారిత్రక కట్టడమే జంతర్‌మంతర్. దీన్ని యునెస్కో ఖగోళ నైపుణ్యాల గుట్టగా అభివర్ణించింది. 2010లో దీనికి ప్రపంచ వారసత్వ హోదా లభించింది.

**రాణీకి వావ్:** పఠాన్‌లో సరస్వతి నది ఒడ్డున ఉన్న ఈ కట్టడాన్ని క్రీ.శ 11వ శతాబ్దంలో రాజా భీమ్‌దేవ్1 తన రాణి ఉదయమతి స్మారకంగా నిర్మించాడు. ఈ వివరణాత్మకమైన మెట్లబావి భారత ఉపఖండంలో భూగర్భజల వనరులు, నిల్వవ్యవస్థ సాధారణ రూపాన్ని ప్రతిబింబిస్తుంది. 2014లో యునెస్కో గుర్తించింది.

**ఫతేపూర్ సిక్రీ:** యూపీలోని ఫతేపూర్ సిక్రీని అక్బర్ 16వ శతాబ్దంలో నిర్మించాడు. 14 సంవత్సరాల తర్వాత అక్కడ నీరు లేకపోవడంతో నిర్లక్ష్యంగా మారింది.

**తాత్కాలిక జాబితా:** ప్రపంచ వారసత్వ జాబితాలో చేరడానికి ముందు, ప్రతి దేశం తమ ప్రదేశాలను తాత్కాలిక జాబితాలో చేర్చాలి. తెలుగు రాష్ట్రాల నుండి తాజాగా తాత్కాలిక జాబితాలో ఉన్న కొన్ని ప్రదేశాలు:

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల కొండల **సహజ వారసత్వ సంపద, భీమిలి ఎర్రమట్టి దిబ్బలు** సహా దేశంలో ఏడు ఆస్తులకు ప్రపంచ వారసత్వ గుర్తింపు కోసం యునెస్కో రూపొందించిన తాత్కాలిక జాబితాలో చోటు లభించింది. మిగిలిన వాటిలో మహారాష్ట్రలోని పంచగాని, మహాబలేశ్వర్ ప్రాంతంలోని డెక్కన్ ట్రాప్స్, కర్ణాటకలోని ఉడుపిలో ఉన్న సెయింట్ మేరీస్ ఐలాండ్ క్లస్టర్ జియోలాజికల్ హెరిటేజ్, మేఘాలయలోని మేఘాలయన్ ఏజ్ గుహలు (ఈస్ట్ ఖాసి హిల్స్), నాగాలాండ్‌లోని నాగా హిల్ ఓఫియోలైట్, కేరళలోని వర్కాల సహజ వారసత్వ సంపద ఉన్నాయి. ఈ ఏడూ తాత్కాలిక జాబితాలో చోటు చేసుకున్నాయి. **తెలంగాణలో గోల్కొండ కోట, కుతుబ్ షాహీ సమాధులు, చార్మినార్ ముదుమల్ మెగాలిథిక్ మెన్హిర్లు తాత్కాలిక జాబితాలో** ఉన్నాయి.

## భారత్ కృషి

భారతదేశం ఒక సంస్కృతుల సంగమభూమి. ఇక్కడ ప్రతి ఇటుక, ప్రతి గిరి, ప్రతి నది చరిత్ర మాట్లాడుతుంది. అందుకే భారతదేశం తన వారసత్వ సంపదను కాపాడుకోవడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటోంది. భారత రాజ్యాంగంలో కూడా వారసత్వ పరిరక్షణకు స్థానం కల్పించారు. నిర్దేశక నియమాలు ఆర్టికల్ 49 ప్రకారం, జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రతి స్మారక చిహ్నం, ప్రదేశం, వస్తువును పరిరక్షించడం రాష్ట్రం బాధ్యతగా పేర్కొనడం జరిగింది. ప్రాథమిక విధులు ఆర్టికల్ 51ఎ(ఎఫ్) ప్రకారం, మన మిశ్రమ సంస్కృతి గొప్ప వారసత్వాన్ని గౌరవించడం, కాపాడడం ప్రతి భారతీయ పౌరుడి ప్రాథమిక విధిగా చెప్పడం జరిగింది. ఈ క్రమంలో 1958 సం॥లో పురాతన కట్టడాలను జాతీయ ప్రాముఖ్యత గల ప్రదేశాలుగా



ప్రకటించి, వాటికి రక్షణ కల్పించడానికి పురాతన కట్టడాలు, పురావస్తు స్థలాలు, అవశేషాల చట్టం ఏర్పాటు చేశారు. 1972 సం॥లో సహజ వారసత్వ సంపదైన అడవులు, జాతీయ పార్కులు, వన్యప్రాణులను కాపాడటానికి వన్యప్రాణి (సంరక్షణ) చట్టం,

భారత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వారసత్వ కట్టడాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 2015లో 'హృదయ్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. గత యేడాది దత్తత విధానంలో వాటి అభివృద్ధికి 'అడాప్ట్ ఎ హెరిటేజ్ 2.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం కింద ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో స్మారక కట్టడాల అభివృద్ధికి కృషి చేయనున్నారు.

అంతేకాకుండా 'దేఖో అప్నా దేశ్ పీపుల్స్ చాయిస్ 2024' పేరిట పర్యాటక శాఖ ఒక ఆన్‌లైన్ పోలింగు ప్రారంభించింది. దీంతో ఈ కట్టడాలు పర్యాటకుల అవసరాల మేరకు అభివృద్ధి జరిగి, వాటిని వీక్షించేవారి సంఖ్య కూడా పెరుగుతూ ఉంది.

మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక వారసత్వ ప్రదేశాలు సంపదలుగా అర్హత పొందవలసినవి పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోని 'లేపాక్షి నంది' ప్రస్తుతం పరిశీలనలో ఉంది. ముఖ్యంగా తెలంగాణలో చార్మినార్, గోల్కొండ కోట, కుతుబ్ షాహీ సమాధులు, అలంపూర్ దేవాలయాలు, మెదక్ చర్చి;

ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం జిల్లా శ్రీముఖ లింగం, శాలిహుండం బౌద్ధ ప్రదేశం, అరసవల్లి సూర్య నారాయణ స్వామి ఆలయం, రామతీర్థం, అరకులోయ, బొర్రా గుహలు 1661–1770 మధ్య కాలంలో నిర్మించిన అనేక కట్టడాలు ప్రపంచ వారసత్వ ప్రదేశాల సంపదలుగా గుర్తింపు పొందడానికి ఎదురు చూస్తున్నాయి.

## వారసత్వ సంపదకు ముప్పు

ప్రపంచంలోని ఏ దేశంలోనైనా పురాతన వస్తువుగానీ శాసనంగానీ బయటపడితే ఎంతో అపురూపంగా చూసుకుంటారు. దానిపై వెంటనే పరిశోధన చేసి చరిత్రను తవ్వితీస్తారు. కానీ మన దగ్గర ఆ పరిస్థితి లేదు. రక్షిత కట్టడాలను నాశనం చేసిన, ఆక్రమించుకున్న వారికి రెండేళ్ల కారాగార శిక్ష అని ప్రాచీన కట్టడాలు, పురావస్తు ప్రదేశాల చట్టం (కేంద్రం) స్పష్టం చేస్తోంది. అయినప్పటికీ చట్టాల ప్రకారం చర్యలు తీసుకున్నా దాఖలాలు ఎక్కడా లేవనే చెప్పవచ్చు.

పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, కాలుష్యం, అక్రమ నిర్మాణాలు, భద్రతలేమి, సహజ విపత్తులు, వాతావరణ మార్పులు, ఉగ్రవాదం, రియల్ ఎస్టేట్ విస్తరణ, పర్యావరణ హాని ఇవి మన వారసత్వానికి



ముప్పు. అనేక పురాతన దేవాలయాలు, శిథిలాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఫలితంగా అమూల్యమైన వారసత్వ సంపదలు కనుమరుగైపోతున్నాయి. మరొకపక్క.. చారిత్రక ప్రముఖులు, రచయితలు, వాగ్గేయకారులు, సంఘ సంస్కర్తల గృహాలు కూడా పరిరక్షణకు నోచుకోకపోవటం దురదృష్టకరం. వారసత్వ సంరక్షణ కేవలం సంస్కృతిని కాపాడడమే కాదు, ఆర్థికాభివృద్ధికి కూడా దోహదం చేస్తుంది.

భారతదేశంలో పర్యాటక రంగంలో 40 శాతం వరకు వారసత్వ పర్యాటకం పాత్ర ఉంది. హంపి, ఖజురాహో, రామప్ప మొదలైన ప్రదేశాలు స్థానిక ప్రజలకు ఉపాధి మార్గాలు అందిస్తున్నాయి. కానీ దీనికోసం పర్యాటకం సుస్థిరంగా ఉండాలి. అంటే పర్యాటకులు వస్తే వారసత్వం నాశనం కాకూడదు, కాపాడబడాలి. ఈ వారోత్సవం ముఖ్యంగా యువతను చైతన్యపరచడానికి అద్భుతమైన అవకాశం. మ్యూజియం సందర్శనలు, హెరిటేజ్ వాక్స్, ఫొటోగ్రఫీ పోటీలు.. ఇవి చరిత్రను పాఠ్యపుస్తకానికి మించి తీసుకెళ్తాయి. చరిత్రతో పరిచయం ఉన్న యువతే భవిష్యత్తు సంస్కృతి సంరక్షకులు అవుతారు.

రామప్ప దేవాలయ శిల్పాలు, ఎల్లోరా గుహల బొమ్మలు, అజంతా చిత్రాలు ఇవన్నీ.. మన పూర్వీకులు వదిలిన సాంస్కృతిక డిఎన్ఏ. వాటిని కాపాడడం అంటే మన జ్ఞాపకశక్తిని నిలబెట్టడం. వారసత్వ వారోత్సవం మనకు ఇదే సందేశాన్ని చెబుతుంది.

ఇది కేవలం పురావస్తు శాఖా ఉత్సవం కాదు. ఇది మన మనుగడ, మన సాంస్కృతిక స్వాభిమానం గుర్తు చేసే ఘంటిక. మన ప్రతి నగరం, ప్రతి పల్లె, ప్రతి పండుగలో ఒక వారసత్వం దాగి ఉంది. దానిని గౌరవించడం, సంరక్షించడం మన అందరి కర్తవ్యం. ఈ సంపదలను కాపాడటం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యమూ కావాలి. నవంబర్ 19–25 వారంలో వాటి విలువను మనసులో నాటుకుంటే మనం కూడా ఆ వారసత్వంలో భాగమవుతాం. వాటిని కాపాడితే మన భవిష్యత్తు కూడా సురక్షితం అవుతుంది. నవంబర్ 19–25 వారంలో మనమందరం ఈ సంపదల రక్షకులుగా మనస్ఫూర్తిగా పాల్గొందాం. వారసత్వ సంపదను కాపాడుకుందాం. ✦

సింగిల్ పేజీ కథ

# జీవితాన్ని మార్చిన పద్యం

ఉదయం 11 గం॥ సమయం.. తిరుపతి రైల్వేస్టేషన్ రద్దీగా ఉంది. రైలు దిగిన ప్రయాణికులు ఒకరినొకరు తోసుకుంటూ వెళ్తున్నారు. గోపాల్, ఇంటికి వెళ్ళే సంతోషంలో గబగబా మెట్లు దిగుతున్నాడు. ఆ తొందరలో తన ముందు పోతున్న వ్యక్తిమీద పడ్డాడు. ఆ వ్యక్తి కోపంగా "బుద్ధి లేదా?" అంటూ అరిచాడు. ఆ అరుపు వచ్చిన వైపు చూశాడు గోపాల్, "హల్లో ధనపాల్, సారీ మై ఫ్రెండ్ చూసుకోలేదు, ఎలా ఉన్నారు?" అంటూ అతన్ని పట్టుకొని గిరగిరా తిప్పేశాడు గోపాల్. ఆ ఇద్దరు మిత్రులు చాలా యేండ్ల తరువాత కలిశారు. ఇద్దరూ ఆ దగ్గర్లోని హోటల్ బీమాస్‌కు వెళ్లి ఎవరూ లేని టేబుల్ చూసి కూర్చొని టిఫిన్, కాఫీ ఆర్డర్ ఇచ్చారు. కష్టం-సుఖాలు పంచుకున్నారు. తను మంచి ఉద్యోగం చేస్తున్నట్లు చెప్పాడు గోపాల్.



ఇద్దరు టిఫిన్ తింటూ మాట్లాడుకుంటున్నారు. నువ్వేంటి ధనపాల్ "డల్‌గా ఉన్నావు. ఆరోగ్యం గాని బాగోలేదా ఏంటి, ఇంట్లో అందరూ బాగున్నారా? అంటూ ప్రశ్నల మీద ప్రశ్నలు వేసి మిత్రుడిని ఉక్కిరి బిక్కిరి చేశాడు, గోపాల్.

"ఏం చెప్పేది గోపాల్! నేను ఇంటర్ చదువేప్పుడే మా నాన్నగారు చనిపోయారు. ఆ దిగులుతో అమ్మ మంచం మీదకు చేరింది. చెల్లి వయసుకొచ్చింది. దాన్ని ఒక ఇంటిదాన్ని చేయాలి, తమ్ముడు కాలేజీ చదువుతున్నాడు, వాడి పుస్తకాలు, ఫీజులు తలకు మించిన భారంగా ఉన్నాయి" అంటూ నిట్టూర్చాడు ధనపాల్.

మాట్లాడుతునే టిఫిన్ తినడం కాఫీ తాగడం పూర్తి అయ్యింది. ఇద్దరు హోటల్ బయటకు వచ్చారు. అక్కడ సుమారు తొమ్మిది ఏండ్ల అబ్బాయి స్కూల్ యూనిఫాం బట్టలతో అడుక్కుంటున్నాడు. "అయ్యా! ధర్మ ప్రభువులు ధర్మం చేయండి అంటూ చేయి చాస్తున్నాడు".

గోపాల్ అతన్ని దగ్గరికి పిలిచి "ఏం బాబు! నిన్ను చూస్తే చదువుకొనే పిల్లోడులాగా ఉన్నావు ఇదేం పని బాబు ఏదైనా పని చేసుకోవచ్చు కదా!" అంటే,

"నేను ఐదో తరగతి చదువుతున్నాను.బడి అయిపోగానే ఈడొచ్చి అడుక్కుంటానయ్యా" అన్నాడు వినయంగా. మా అమ్మ, అయ్య జబ్బు మనుషులు సార్, వాళ్ళ బువ్వకు, మందులకు రోజుకు బోలెడు డబ్బులు కావాలండీ, అందుకే అడుక్కుంటున్నాను సార్. అయినా వాళ్ళు రగతమాంసాలు పంచి నాకు ప్రాణం పోసినోళ్ళకు నేనుగాక ఇంకెవరు బువ్వ పెడతారండి. కన్నోళ్ళను మరిచిపోతే ఇక నా పాణం ఎందుకండీ? అందుకే నేను బాగా చదివి పెద్ద ఉద్యోగం చేసి అమ్మా నాన్నలను బాగా చూసుకోవాలి సారూ, అప్పుడే నా పుట్టుకకు సార్థకత.. అంటూ దీనంగా చేయి చాపాడు.

గోపాల్ మనసులో ఎవరో చేయి పెట్టి గెలికినట్టయింది. ఇంత చిన్న వయసులో తల్లిదండ్రుల మీద ఎంత ప్రేమ ఉంది అనుకుంటూ, చిన్నప్పుడు తన తెలుగు మాష్టారు చెప్పిన "తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుండు...." అనే పద్యం మనసులో అనుకుంటూ పైకి అనేశాడు.

ఆ కుర్రోడు చప్పట్లు కొడుతు నాకెంతో ఇష్టమైన పద్యం సార్ అది. ఆ పద్యమే నా జీవితానికి దిక్సూచి సార్!" అంటూ ఆనందంతో తన చిరిగిన చొక్కాతో కళ్ల తుడుచుకోబోతే- "బాబూ, ఇదిగో ఈ కర్చీఫ్‌తో తుడుచుకో" అంటూ అందిందాడు గోపాల్.

అంతవరకు మౌనంగా ఉన్న ధనపాల్ "నువ్వు నా ప్రాణాలు నిలబెట్టావురా! నా చిట్టి తండ్రీ!" అంటూ బిగ్గరగా ఏడుస్తూ ఆ పిల్లోడ్ని గట్టిగా కౌగిలించుకొన్నాడు. గోపాల్‌కు ఏం అర్థం కాలేదు.

"ఏంటి ధనపాల్, నువ్వు అంటున్నది? ఏం జరిగింది?" అన్నాడు. "నన్ను క్షమించు మిత్రమా! ఈరోజు నువ్వు లేకపోతే నా శరీరం ఆ రైలు పట్టాలకింద నలిగి తునాతునకలయి పోయేది. నాకున్న సమస్యలకు నా చావు ఒక్కటే మార్గం అని తీర్మానించుకొని రెండు రోజులుగా రైల్వేస్టేషన్‌కు వస్తున్నాను. ఎలా చావాలి? ఏ రైలు కింద పడాలని.. అని ఆలోచిస్తూ రోజు భయంతో చస్తూ బతుకుతున్నాను. ఈరోజు నీ రాకతో, ఈ బాబు మనోధైర్యం, తల్లిదండ్రుల మీద అతనికున్న అనంతమైన ప్రేమ నన్ను బతికిందాయి. జీవితంలో పోరాడి జయించాలి కాని చావు పరిష్కారం కాదన్న సత్యం తెలుసుకొన్నాను. నాలో బతకాలనే ఆశను పుట్టించిన ఈ చిరంజీవి వర్ధిల్లాలి" అన్నాడు ఎంతో సంతోషంగా ధనపాల్.

వాళ్లిద్దరికీ తన విజిటింగ్ కార్డు ఇచ్చి "ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నన్ను కలవండి" అని చెప్పాడు గోపాల్.

"మనిషి కష్టాల్లో ఉన్న సాటి మనిషిని ఆదరించాలని మా గురువు గారు చెప్పిన మాట ఆచరించడమే ధర్మం" అన్నాడు గోపాల్.

– డాక్టర్ నెమిలేటి కిట్టన్న

# కాల నృత్యం

కరిగిపోయే కాలమంతా
జరిగిపోయే సెలయేరు
కాలం ఆగదు ఎవరికోసం
వేదన అయినా ఆనందం అయినా...

గతం వెనుకే మిగిలిపోతుంది
జ్ఞాపకం మాత్రమే మనతో ఉంటుంది
నిన్నని మర్చిపోలేము...
రేపు మాత్రం మనకోసం ఎదురుచూస్తుంది..

మాటలు మసకబారతాయి
చిరునవ్వులు మిగిలిపోతాయి
కన్నీరు కరిగిపోతుంది

గమనమై మారిపోతుంది
కాలం మనకు శిక్షకుడు..

ప్రతి క్షణం ఒక పాఠమవుతుంది
ఆగక మనసా నడవు ముందుకు

జీవితం అనేది సాగరమే
జరిగిపో, జీవించిపో
చీకటి వెనక వెలుగు ఉంటుంది

కాలం చెబుతుంది ఒక్క మాట
“ముందుకు వెళ్లు, వెనుకకు చూడకు”

– వంకాయలపాటి వెంకట సూర్యనారాయణ

ఈ వారం కవిత్వం

# కృత్రిమ ప్రేమలు



ఆకాశమంతా హృదయ తోటలో
ఎన్నో కలల పుష్పాలను నాటానో
చెమట చుక్కల నీటితో
మనసు ఇటుకలను పేరుస్తూ
పునాదులను నిర్మించాను
అనుక్షణం బతుకు పోరుకు
అక్షరాల పైసా పైసా కూడబెట్టి
ఆశయాల సౌధంలో

భవిష్యత్ బ్యాంకు ఖాతాలో
జమచేస్తూ ముందడుగై
సాగాను
తొలిపొద్దున మడి కట్టుకుని
తులసి కోటపై పెట్టిన
దీపాలకు
ఈదురు గాలులు తగిలిన
పచ్చని మొక్కవలె నిటారుగా
చెక్కుచెదరని
శిల్పంవలె
మదిలో ధ్యానం
చేస్తున్నా !

కాంక్రీటు కలల
సమాజంలో
అమావాస్య చంద్రుడిలా
ఎవ్వరికీ అందని
మెతుకు విన్యాసం చేస్తున్నా !
వెజిటేరియన్ హృదయ పాత్రలో
ఎన్నిసార్లు పోపులు వేసి

తాలింపుల వాసన సువాసనలకు
ఇరుగు పొరుగు ఆత్మీయుల
పలకరింపులు
ప్రేమలను ఒలకబోస్తూ
పలకరించినట్లే అనిపిస్తున్నది
కాలం వాలిపోతున్న వైపున
మనస్తత్వాల బేరీజు ఆటలో
తీపికబుర్ల కాలక్షేప విన్యాసంలో

సమకూర్చిన ప్రేమలన్నీ కూడా
గట్టితనం లేని వట్టి
కృత్రిమమైన మాయజాల ప్రేమలే !!

– డాక్టర్ పగిడిపల్లి సురేందరు

# పక్షులే వెళ్ళాలా..

చెట్టు పిలిస్తే
ఆకు దీవించింది
పరిగెట్టి వెళితే!

వూరు పేరెందుకు
పచ్చక పలకరిస్తే
ఇన్నాళ్ళెటెళ్ళావో
నిలదీసింది తుమ్మెద
నది లాక్కెళ్ళింది మరి!

కొండ నీడ పలకరిస్తే
నీ పెరటి చెట్టు నీడనయ్యా!

– టి.లలితప్రసాద్

# బంధాలు-బాధలు

పోరాడుతూనే
ఉంటాను.
బంధాల తాడ్లను
పేనుకొని
ఆయుధంగా మారి పోరాడుతాను.
బాధలన్నీ ముప్పేట దాడి చేసినా
మేఘ సమూహంగా ముందుకెళ్లి
వర్షిస్తాను.
ఎండుపుల్లలను పోగేసుకొని
కుంద కింద నిప్పు పెట్టుకోవాలి కానీ
నెత్తికి కొరివి పెట్టుకుంటే ఎలా?
నువ్వు అగ్గిపెట్టెలో ముడుచుకొని
నాకేమి కాదనుకుంటే ఎలా?
అదే నీ మరణానికి
తొలి అడుగని తెలుసుకో.
నేడు నీ కండలు బిగుసుకునే
ఉంటాయి.
సూర్యుడు అటు
నుండి ఇటు
స్థానాన్ని
మార్చుకునేలోపే రాలిపోయిన
కన్నులను వెతుక్కోకపోతే బాధలు.
బంధాలు బహిష్కరిస్తాయి;
ఆ తర్వాత నిన్ను నువ్వు కూడా
బహిష్కరించుకోవాలి.
ఒక విషయం తెలుసా?
ఈరోజు.. నువ్వు కాళ్ల
గోతిలో పాతి పెట్టుకుంటోంది
నీ కడుపున పుట్టిన బంధాల కోసమే!
విస్మరిస్తే ఎలా?

– జాని తక్కెడశిల

# నియంత్రణే ఏకైక మార్గం

ప్రపంచ దేశాల్లో మధుమేహం/డయాబెటిస్ అత్యధికంగా విస్తరించి ఉన్న దేశంగా భారత్ మరో చరిత్రను సృష్టించడంతో పాటు 'ప్రపంచ మధుమేహ రాజధాని భారత్' అనే ప్రతికూల ఖ్యాతిని మూటగట్టుకుంటున్నది. 'ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫెడరేషన్' వివరాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 40 యేండ్లు దాటిన ప్రతి 8 మంది వయోజనుల్లో ఒకరు మధుమేహంతో బాధపడుతున్నారని తేలింది. భారత్‌లో అత్యధికంగా 100 మిలియన్లకు పైగా మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మధుమేహ రుగ్మత వల్ల మానవాళిపై అత్యంత సామాజిక ఆర్థిక భారం పడుతున్నది. భారత్‌లోని గోవా(26.4 శాతం), పుదుచ్చేరి(26.3 శాతం), కేరళ (25.5 శాతం) రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో అత్యధికంగా మధుమేహం ఉన్నట్లు తేలగా, యూపీలో అత్యల్పంగా 4.8 శాతం మాత్రమే ఉన్నట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

## అవరోధాల్ని ఛేదిద్దాం

మధుమేహ వ్యాధి వ్యాప్తి పెరగడం, ప్రమాదకరంగా మారడంతో దాని పట్ల ప్రజల్లో అవసర అవగాహనను కల్పించడానికి 1992 నుంచి ప్రతి యేటా నవంబర్ మాసాన్ని 'ప్రపంచ మధుమేహ మాసం'గా పాటించటం ఆనవాయితీగా మారింది. ప్రపంచ మధుమేహ మాసం2025 ఇతివృత్తంగా 'మధుమేహం శ్రేయస్సు (డయాబెటిస్ వెల్ బీయింగ్)' అనే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. మధుమేహ వ్యాధికిగల కారణాలు, వ్యాధి లక్షణాలు, నియంత్రణ మార్గాలు, చికిత్స విధానాల పట్ల అవగాహన కలిగిస్తూ 'మధుమేహ నిశ్శబ్ద విధ్వంసాన్ని' ఆపడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి.



## మధుమేహానికి ఊతం ఇవ్వగల కారణాలు

భారత్‌లో మధుమేహం కోరలు చాచడానికి ప్రధాన కారణాలుగా ఆర్థిక/పోషకాహార మార్పులు, స్థూలకాయం, అధిక కాలరీలు/కొవ్వులు/షుగర్స్ కలిగిన ఆహారాలను లొట్టలేసుంటూ తినడం, ఇన్సులిన్ నిరోధకత, శారీరక శ్రమ లోపించడం, సంపన్న జీవనశైలిని కౌగిలించుకోవడం, అధిక పనిభారం, మానసిక ఒత్తిడి పెరగడం, ఫాస్ట్/జంక్ ఫుడ్ తినడం, పొగ/ఆల్కహాల్ తాగడం లాంటి పలు అంశాలు దోహదపడుతున్నాయి.

## నివారణ/నియంత్రణ మార్గాలు

మధుమేహ భూతాన్ని తరమడానికి జీవనశైలిలో సానుకూల మార్పులు చేసుకోవడం ప్రధానమైనది. శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, క్రమం తప్పకుండా శారీరక శ్రమ కనీసం ముప్పై నిమిషాలు చేయడం, పొగ/ఆల్కహాల్ తాగడాన్ని మానుకోవడం, గంటల తరబడి కూర్చొని నిశ్చల స్థితిలో పని చేయడాన్ని తప్పించడం, తరచుగా వైద్యుల సలహాలను తీసుకోవడం, షుగర్ పరీక్షలను చేయించుకోవడం లాంటి మార్పులు చేసుకోవాలి.

## వ్యాధి లక్షణాలు

మధుమేహం మూడు రకాలుగా కనిపిస్తుంది. టైప్ 1 డయాబెటిస్, టైప్ 2 డయాబెటిస్, గెస్టేషనల్ (గర్భిణి స్త్రీల్లో) డయాబెటిస్ అనే మూడు రకాల మధుమేహ వ్యాధిగ్రస్తులు కనిపిస్తారు. టైప్ 1 మధుమేహం చిన్నతనంలోనే రావచ్చు. దీనిని నిరోధించలేం. నియంత్రించగల టైప్ 2 డయాబెటిస్ వ్యాధి 40 యేండ్లు దాటిన వారిలో అధికంగా కనిపిస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో 90 శాతం మంది టైప్ 2 డయాబెటిస్ బారిన పడ్డారని తెలుస్తున్నది. శరీరానికి అవసరమైన ఇన్సులిన్ విడుదల కాకపోవడం లేదా అవసరానికి మించి షుగర్స్ తినడం వల్ల మధుమేహం ప్రారంభమవుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు గుండె జబ్బులు, స్ట్రోక్, కాళ్లు-చేతి భాగాల తొలగింపు, బీపీ, పుండ్లు మానకపోవడం, దాహంగా ఉండడం, తరుచుగా మూత్రం రావడం, బరువు తగ్గడం, బలహీనంగా ఉండడం, అలసట, మానసిక ఉద్రిక్తతలు, కంటిచూపు మందగించడం, నాడీమండలం ప్రభావితం కావడం, మూత్రపిండాలు చెడిపోవడం, కంటిచూపుపై ప్రభావం పడడం, వినికిడి సమస్యలు ఉత్పన్నం కావడం, కాళ్ల ఇబ్బంది, అల్జీమర్స్ వ్యాధి రావడం లాంటి వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి.

ఒకసారి డయాబెటిస్ నిర్ధారణ అయితే జీవితకాలం దానిని పెరగకుండా అదుపులో ఉండే విధంగా నియంత్రించుకోవడమే ఏకైక మార్గంగా తెలుస్తున్నది. ఇలాంటి జీవనశైలి రుగ్మతలు దరికి చేరకుండా చూసుకోవడమే ఉత్తమం. చాప కింద నీరులా సైలెంట్ కిల్లర్ రూపంలో ప్రపంచ మానవాళిని కుదిపేసేందుకు సిద్ధంగా ఉన్న మధుమేహాన్ని దగ్గరకు రాకుండా చూసుకోవడానికి సిద్ధంగా ఉందాం, డయాబెటిస్‌ను కట్టడి చేద్దాం.

– డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# మృదువైన అధరాలకోసం..

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా చలికాలంలో పెదవులు పొడిగా అయిపోవడం, పగలడం.. వంటివి జరుగుతూ ఉంటాయి. అంతమాత్రాన బాధపడాల్సిన అవసరం ఏమీ లేదు. ఎందుకంటే ఇంట్లో లభించే పదార్థాలతోనే తిరిగి వాటిని సాఫ్ట్‌గా మార్చేయవచ్చు. పెదవులు పగలడానికి చల్లగాలులే కారణం కాదు, విటమిన్ ఇ లోపం, శరీరంలోని తేమశాతం తగ్గడం, పొగ తాగడం, అలాగే పెదవులను తరచూ నాలుకతో తడి చేసుకుంటూ ఉండటం.. ఇలా అనేక అంశాలు కూడా అందుకు దోహదం చేస్తాయి.

– రెండు చెంచాల పంచదార, చెంచా తేనె జత చేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదవులకు రాసుకుని కొన్ని నిమిషాలు అలానే ఉంచాలి. తర్వాత వేళ్ల చివర్లతో పెదవుల చుట్టూ మెల్లగా రుద్దాలి. ఇప్పుడు గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకుంటే సరి. ఇలా చేయడం వల్ల పై పొరల్లో ఉండే మృతకణాలు తొలగిపోతాయి. ఫలితంగా పెదవులు మృదుత్వాన్ని సంతరించుకుంటాయి. ఈ సమస్య నుంచి బయట పడటానికి చాలామంది ఖరీదైన లిప్ బామ్స్, క్రీములు వంటివి వాడుతుంటారు. కానీ ఈ సమస్యకు అద్భుతమైన పరిష్కారాలు మన వంటింట్లోనే దాగి ఉన్నాయి. ఎలాంటి రసాయనాలు లేకుండా అతి తక్కువ ఖర్చుతో మీ పెదవులను తిరిగి మృదువుగా, ఆరోగ్యంగా మార్చే ఐదు సులభమైన హోం రెమెడీస్..

– మార్కెట్లో లభించే రసాయనాలతో కూడిన లిప్ బామ్‌లను నివారించాలనుకుంటే, ఇంట్లో తయారు చేసిన దేశీ లిప్ బామ్‌ను తయారు చేసుకోండి. నెయ్యిని కరిగించి, ఆ తర్వాత కలబంద జెల్, విటమిన్ ఇ ఆయిల్, నచ్చిన ముఖ్యమైన నూనెను జోడించండి. ఈ మిశ్రమం చల్లబడి మృదువుగా మారిన తర్వాత, దానిని ఒక చిన్న కంటైనర్‌లో నిల్వ చేయండి. ఈ సహజ లిప్ బామ్ పెదాలను తేమ చేస్తుంది. అవి పగుళ్ల రాకుండా నిరోధిస్తుంది. చలిలో బయటకు వెళ్ళేటప్పుడు నోటిని మాస్క్ లేదా రుమాలుతో కప్పుకోవాలని నిపుణులు సలహా ఇస్తారు, తద్వారా పెదవులు చల్లని గాలికి నేరుగా తగలకుండా ఉంటాయి.



– కొబ్బరినూనె సహజ మాయిశ్చరైజర్‌లా పనిచేసి పగిలిన పెదాలను తిరిగి సాధారణ స్థితికి తీసుకువస్తుంది. రోజంతా ఎన్ని సార్లు వీలైతే అన్ని సార్లు పెదాలకు కొద్దిగా కొబ్బరినూనె రాసుకుంటూ ఉండాలి. ఈ విధంగా చేయడం వల్ల పెదవుల్లోని తేమ ఎక్కువ సమయం నిలిచి ఉండటానికి అవకాశం ఉంటుంది. కొబ్బరి నూనెకు బదులు ఆలివ్ ఆయిల్‌ని కూడా ఉపయోగించుకోవచ్చు. ఇందులో సహజంగా ఉండే కొవ్వు పదార్థాల శాతం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, ఇది కూడా సహజసిద్ధ మాయిశ్చరైజర్‌గా పనిచేస్తుంది. పెదవులకు ఈ క్రీమ్‌ని రాసుకుని పది నిమిషాల పాటు ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీళ్లలో ముంచిన దూదితో శుభ్రంగా తుడుచుకోవాలి. ఇలా రోజూ చేయడం వల్ల పెదవులు మృదువుగా మారుతాయి.

పగిలిన పెదవులను సాధారణ స్థితికి తీసుకురావడానికి పెరట్లో ఉండే గులాబీ రేకులు కూడా ఉపయోగపడుతాయి.

– కొన్ని గులాబీ రెక్కలు తీసుకుని నీళ్లతో బాగా శుభ్రం చేసుకోవాలి. తర్వాత వాటిని కొన్ని గంటల పాటు పాలలో నానబెట్టాలి. తరువాత వాటిని మెత్తని ముద్దలా చేసుకుని రోజుకు 2 లేదా 3 సార్లు రాసుకుంటూ ఉండాలి. ఇలా చేయడం వల్ల పెదవుల పగుళ్ళు తగ్గి సాధారణ స్థితికి రావడమే కాదు. మంచి రంగును కూడా సంతరించుకుంటాయి.

– తేనెలో ఉండే యాంటీబ్యాక్టీరియల్, గాయాన్ని మాన్పించే గుణాల వల్ల పగిలిన పెదవులకు ఇది కూడా చక్కని పరిష్కారంగా ఉపయోగపడుతుంది. పెదవులు పొడిగా అనిపించిన ప్రతిసారి తేనెను తరచూ రాసుకుంటూ ఉండాలి. అలాగే తేనెకు కొద్దిగా గ్లిజరిన్ జతచేసి ఈ మిశ్రమాన్ని రోజూ పడుకునే ముందు పెదాలకు రాసుకోవాలి. ఫలితంగా కొద్ది రోజుల్లోనే లేలేత అధరాలు సొంతమవుతాయి.

– ఆముదం, గ్లిజరిన్ ఒక్కో చెంచా చొప్పున తీసుకుని అందులో కొద్దిగా నిమ్మరసం మిక్స్ చేయాలి. ఈ మిశ్రామాన్ని రోజూ పడుకునే ముందు పెదవులకు రాసుకోవాలి. పొద్దున్న లేవగానే గోరువెచ్చని నీళ్లలో ముంచిన దూదితో పెదాలను శుభ్రం చేసుకోవాలి. పెదవుల పగుళ్ల తగ్గేవరకూ ఈ విధంగా చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

– ఆనంద 'మైత్రేయ'మ్

# చెట్లు భూమికి ప్రాణాధారం

ప్రకృతి మనకు ఇచ్చిన అతి విలువైన కానుక చెట్లు. ఇవి భూమికి ప్రాణాధారం, మనిషి ఉనికికి మూలస్తంభాలు. చెట్ల నీడలో భూమి చల్లబడుతుంది. అది భూమి గర్భం నుండి నీటిని పీల్చి, గాలిలోని కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి, ఆక్సిజన్‌ను విసర్జిస్తుంది. కానీ మనం అభివృద్ధి పేరిట అడవులను నాశనం చేస్తూ, భవిష్యత్తు తరాలకు ఊపిరాడని స్థితిని సృష్టిస్తున్నాం. చెట్టు మనిషి కంటే ఎక్కువ కాలం భూమిని కాపాడుతుంది, పచ్చదనాన్ని నిలుపుతుంది, వాతావరణాన్ని సరిచేస్తుంది. వాహనాల నుంచి, పరిశ్రమల నుంచి వస్తున్న ధూళి, హానికర వాయువులను చెట్లు సహజంగా గ్రహిస్తాయి.



పాఠశాలలు, దేవాలయాలు, రహదారులు ఇలా.. ప్రతి చోట ఒక మొక్క నాటితే, అది మన శ్వాసలో కొత్త జీవాన్ని నింపుతుంది. పచ్చదనం కేవలం సౌందర్యం కాదు, అది సమతుల్య జీవన విధానం. మనిషి ఆరోగ్యం, వర్షపాతం, పంటల ఉత్పత్తి అన్నీ చెట్లతో ముడిపడి ఉన్నాయి. పచ్చని చెట్లు వాతావరణాన్ని సమతుల్యం చేస్తాయి. వర్షాన్ని పిలుస్తాయి, వేడిని తగ్గిస్తాయి. అడవులు లేకుండా నదులు ఎండిపోతాయి, పంటలు విఫలమవుతాయి. మనం ఆర్థికాభివృద్ధి, నగరీకరణ, టెక్నాలజీ అనే పేర్లతో చెట్లను నరికేస్తున్నాం. కానీ నిజమైన అభివృద్ధి అంటే పచ్చదనం పెరగడం. ఎత్తైన భవనాలు, కాంక్రీటు రోడ్లు మనిషికి ఊపిరి ఇవ్వలేవు. కానీ ఒక చిన్న తులసి మొక్క సైతం గాలిని శుద్ధి చేస్తుంది, మనసుకు ప్రశాంతి ఇస్తుంది. పాఠశాల పిల్లలు ఒక చెట్టు నాటితే అది వారికి జీవిత పాఠం అవుతుంది. రైతులు తమ పొలాలలో పక్కపక్కన మొక్కలు నాటితే అది వారి పంటలను కాపాడుతుంది. నగరాల్లో ప్రతి ఇంటికి ఒక కుండిలో మొక్క ఉంటే అది సమాజానికి శ్వాసనివ్వగలదు. చెట్లు కేవలం వాతావరణాన్ని కాదు, మనసును కూడా పచ్చగా ఉంచుతాయి. ఒక పచ్చని వనం చూస్తే మనసుకు కలిగే సాంత్వన ఎలాంటి మందుల వల్లా రావు. పూల పరిమళం మన భావోద్వేగాలను మృదువుగా చేస్తుంది. పచ్చదనం అంటే జీవన తత్త్వం. రేపటి కాలుష్యాన్ని నివారించడానికి మొక్కలు నాటడమే సరైన మార్గం. ఎయిర్ ప్యూరిఫయర్లు, టెక్నాలజీ వాయు శుద్ధి పరికరాలు ఎంత ఉన్నా, ఒక వృక్షం ఇచ్చే ఆక్సిజన్ వాటికి సాటి కాదు. మన పిల్లలకు శుభ్రమైన గాలి, చల్లని వాతావరణం, అందమైన ప్రకృతి ఇవ్వాలంటే మనం చర్యలు తీసుకోవాలి.

పచ్చదనం మన సంస్కృతిలో భాగం. పురాతన భారతీయ తత్వంలో చెట్లను దేవతలుగా పూజించేవారు. తులసి, పీపల్, నీమ్, వేప, బన్యన్ వంటి చెట్లు ఆరోగ్యానికి, ఆధ్యాత్మికతకు సంకేతాలు. చెట్టు కింద కూర్చుని ధ్యానం చేసే ఆచారం మన సంస్కృతిలో వేరే రూపంలో ఉన్న పర్యావరణ శాస్త్రమే. మొక్కను నాటడం అంటే భవిష్యత్తును నాటడం. అది మన పిల్లల కోసం పెట్టుబడి, భూమికి ఇచ్చే కృతజ్ఞత. ప్రతి వ్యక్తి తన ఊర్లో ఒక చెట్టు నాటితే, ఆ ఊరు పచ్చని పల్లెగా మారుతుంది. ప్రతి పట్టణం పచ్చగా మారితే దేశం ఊపిరి పీలుస్తుంది.

మనిషి తన జీవితాన్ని ఎన్ని సార్లు మార్చుకున్నా ప్రకృతి మారదు. కానీ మనం ప్రకృతిని కాపాడకపోతే మన ఉనికి కూడా నిలవదు. కాబట్టి ఈ రోజు నుంచే మనం మన చుట్టూ పచ్చదనం నింపాలి. పచ్చని ఆలోచన, పచ్చని చర్య, పచ్చని భవిష్యత్తు ఇవే మన రేపటి ప్రాణాధారాలు. మనిషి ప్రగతి మార్గంలో ఎంత దూరం ప్రయాణించినా, చివరికి తిరిగి చేరే దారి ప్రకృతికే ఉంటుంది. ఎందుకంటే భూమి మనకిచ్చిన బహుమతి కాదు మనం తాత్కాలికంగా అద్దెకు తీసుకున్న ఆశ్రయం మాత్రమే. ఈ ఆశ్రయాన్ని సురక్షితంగా ఉంచడం మన బాధ్యత. మొక్కలు మనం నాటకపోతే భూమి మనను నిలపదు. ఒక చెట్టు నాటడం అంటే గాలి, నీరు, నేల, పక్షులు, జంతువులు.. అన్నింటికీ జీవన దానం చేయడం. అది మన స్వార్థం కాదు, మన సమాజం పట్ల ప్రేమ. ఈ ప్రేమే భూమిని కాపాడగలదు. పచ్చని వనాలు మనలోని కఠినతను దూరం చేస్తాయి. నప్రతి ఊరి చెట్లు ఆ ఊరి సంస్కృతికి ప్రతిబింబాలు.

ఈ భూమి మీద మనిషి జీవించాలంటే చెట్లు జీవించాలి, పూలు విరియాలి, పక్షులు ఎగరాలి. మనకు ఈ గ్రహం మన పితరుల నుండి వారసత్వంగా రాలేదు, అది మన పిల్లల నుండి తీసుకున్న అప్పు. ఆ అప్పు తీర్చే మార్గం మొక్కలు నాటడమే. పచ్చదనం మన భవిష్యత్తు ఊపిరి, మన సమాజపు పరిమళం, మన సంస్కృతి నిలువుటద్దం. మన గడప ముందర ఒక మొక్కను నాటి దాన్ని ప్రేమగా నీళ్లు పోస్తే ఈ భూమికి కొత్త జీవం ఇస్తుంది. మనం చెట్టును కాపాడితే, చెట్టు మన ఊపిరిని కాపాడుతుంది.

– డా॥ చిటికెన కిరణ్‌కుమార్

కథ

# ఎలుక పొక్క

కోరుట్లపేట గ్రామంలో రమేష్, రాణి అనే రైతు దంపతులు ఉన్నారు. వీరిది వ్యవసాయ కుటుంబం. వాళ్లకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వీరికి వివేక్ అనే కొడుకు ఉన్నాడు.

వివేక్ పది సంవత్సరాలు ఉంటాడు. నాలుగవ తరగతి చదువుతున్నాడు. చాలా తెలివి కలవాడు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్తాడు. గురువులు చెప్పిన పాఠాలు చక్కగా వింటాడు. మిత్రులతో కలిసి మెలిసి ఉంటాడు. అందరూ అతన్ని మెచ్చుకుంటారు. ఇంటిదగ్గర పిల్లలతో రకరకాల ఆటలాడుతాడు. మట్టి బొమ్మలు తయారు చేస్తాడు. కంప్యూటర్‌లో, చేతితో చక్కని బొమ్మలు గీస్తాడు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తాడు. వివేక్ అమ్మకు ఇంటి పనులకు సహకరిస్తాడు. నాన్నకు పొలంలో పనులకు సహకరిస్తాడు. వివేక్ రోజు వాళ్ల నాన్న రమేష్‌తో పొలానికి వెళ్తాడు. నాన్నతో పాటు పొలం చుట్టూ తిరుగుతాడు.



సమస్యమేమిటంటే– పొలంలో ఎన్ని నీళ్ల పెట్టినా ఉంటలేవు. ఎలుకలు పొక్కలు చేసి నీళ్ల బయటికి వెళ్లిపోతున్నాయి. రమేష్ ఎన్నిసార్లు పొక్కల్లో మట్టి నింపిన తెల్లారి వచ్చి చూస్తే రంధ్రాలు పడి ఉంటున్నాయి. చేను ఎండిపోతోంది. రమేష్ ఏం చేయాలో తోచక బాధపడుతుంటారు.

తండ్రి బాధ చూసిన వివేక్ ఓ ఆలోచన చేస్తాడు... "నాన్నా! నీవు ఒడ్లకు ఉన్న ఎలుకల నివాసాలు మూసేసావు. అందుకే అవి పదే పదే బయిటకు వస్తున్నాయి. నీళ్ల పోతున్నాయి. అయితే ఎలుకలు బయటకు వచ్చినా నీళ్ల కిందికి పోకుండా చేద్దాం. రంధ్రాలు మూయకుండా పక్కనే ఎత్తుగా (చిన్న ఒడ్లు)సాయలు పెడదాం" అని వివేక్ అనగానే వెంటనే సాయలు పెట్టారు.

తెల్లవారి పొలంలోకి వచ్చారు. ఎలుక పొక్కలు తెరిచే ఉన్నాయి. అయినా చేను నిండా నీళ్ల ఉన్నాయి. రమేశ్ తన కొడుకు వివేక్‌ను ఎత్తుకుని ముద్దు పెట్టుకుని అభినందించాడు. "పిల్లల్లో కూడా తెలివితేటలు ఉంటాయి.. అని తక్కువ అంచనా వేయరాదని" అనుకున్నాడు. కొడుకుని మెచ్చుకుని ఎంతగానో సంతోషించాడు.

వివేక్ బాగా చదువుకుని భవిష్యత్తులో వ్యవసాయ శాస్త్రవేత్త అయ్యాడు. అతని కుటుంబం ఆనందంలో మునిగిపోయింది.

– డా॥ వాసరవేణి పరశురాం





## బాలగేయం

### క్రమశిక్షణ

తెల్లవారక ముందే లేద్దాం
కాలకృత్యాలు తీసుకుందాం
శుభ్రముగా తయారవుదాం
వేళకు బడి బాట పడుదాం.

భద్రంగా ఇంటికి చేరుదాం
అమ్మ చెప్పింది విందాం
బుద్ధిగా హోమ్ వర్క్ చేద్దాం
ఇంద్రధనస్సును చూద్దాం.

సీతాకోక చిలుకలను
పట్టుకుందాం
ఆదివారం ఆడుకుందాం
వీడియో గేములు
మానుకుందాం.

అమ్మ నాన్న చెప్పిందే చేద్దాం.
పెద్ద బాల శిక్ష చదువుదాం
తెలుగు చక్కగా నేర్చుకుందాం.

మాతృదేశాన్ని ప్రేమిద్దాం
భావి భారత పౌరులవుదాం
ఐక్యంగా జాతీయ గీతం
పాడుదాం.

– పూసాల సత్యనారాయణ

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

కార్తి, శ్రీరంగాపురం

ప్రశ్న: ఐ.ఎ.ఇ.ఎ. అంటే ఏమిటి?

**జవాబు:** ఐక్య రాజ్యసమితి (యు.ఎన్.ఓ.)కి అనుబంధ సంస్థగా ఉండే ఐ.ఎ.ఇ.ఎ. అంటే ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ. దీని ప్రధాన కార్యాలయం ఆస్ట్రియా రాజధాని వియన్నాలో ఉంది. ఈ సంస్థ జులై 29, 1957లో ఆవిర్భవించింది. ఇది ఐ.రా.స.కి అనుబంధమే అయినప్పటికీ స్వంతంగా నిర్ణయాలు తీసుకోగలదు. అణుశక్తిని శాంతియుత ఉపయోగాలకి వాడేందుకు ఈ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో కృషి చేస్తున్నది. యుద్ధాల్లో అణుశక్తిని వాడితే అంతా నాశనమే కనుక అణుపరిశోధన, అభివృద్ధి మానవుని శక్తి అవసరాలను తీర్చే దిశగా సాగాలని కృషి చేస్తున్న సంస్థ ఇది.

ఎస్.సుధాకర్, కోహెడ

**ప్రశ్న: మామూలు సినిమాకు, 3డీ సినిమాకు తేడా ఏమిటి?**

**జవాబు:** మామూలు సినిమాలు చూస్తున్నప్పుడు మనం పొడవు, వెడల్పు కొలతలు రెండింటిని మాత్రమే గ్రహిస్తాం. 3డీ సినిమాలకు మూడు కొలతలు అవసరం. పొడవు, వెడల్పు, లోతు ఉండే విధంగా ప్రత్యేక టెక్నాలజీని ఉపయోగించి 3 డీ సినిమాలను రూపొందిస్తారు. 3డీ సినిమాలను గురించి వినే వుంటారు. తెలుగులో కూడా డబ్ అయ్యాయి. ఈ సినీ ప్రేక్షకులకు ప్రత్యేక కళ్లజోళ్లను కూడా రూపొందించారు. వీటి ద్వారా ఈ సినిమాలను చూస్తే తెరమీద ఉన్న బొమ్మలు మనకు అతి సమీపంగా ఉన్నట్లు భ్రమ చెందేలా కనిపిస్తాయి.





## టూత్‌బ్రష్ క్లీనర్

సాధారణంగా పళ్లు శుభ్రం చేసుకోవడానికి టూత్‌బ్రష్ వాడుతుంటాం. మరి ఆ బ్రష్‌ను శుభ్రం చేయడానికి అవసరమేముంది అనుకుంటున్నారా? కానీ ఆ తడికే క్రిములు ఎక్కువ చేరతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు అల్ట్రావైలెట్ సి టూత్ బ్రష్ శానిటైజర్ కవర్ వచ్చింది. ఇది పళ్లు తోముకునే బ్రష్‌ను శుభ్రం చేస్తుంది. అలాగే దుమ్ముధూళీ చేరకుండా నీట్‌గా ఉంచుతుంది. ఈ డివైజ్‌కి ఒక్కసారి చార్జింగ్ పెడితే 30 సార్లు పనికొస్తుంది. వినియోగించిన ప్రతిసారి 5 నిమిషాల్లో ఆటోమేటిక్‌గా ఆఫ్ అవుతుంది.



ఇలాంటి ఉత్పత్తుల్లో బ్యాటరీలతో పనిచేసే క్లీనర్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. కానీ తడి తగిలితే ఆగిపోయే అవకాశాలెక్కువగా ఉంటాయి. కానీ దీనికి ఆ సమస్య ఉండదు. వాష్‌రూమ్‌లోనే ఉంచుకోవచ్చు. అలాగే ప్రయాణాలలో బ్రష్‌కే ఈ డివైజ్‌ను ఉంచేసి ఎక్కడికైనా తీసుకెళ్లవచ్చు. ఇది బ్రష్‌కు ఉన్న తడిని అయిదు నిమిషాల్లో పోగొట్టడంతోబాటు 99.9 శాతం క్రిములను, బ్యాక్టీరియాను, వైరస్‌ను నాశనం చేస్తుంది. ఈ మినీ బాక్స్‌కి ఒకవైపు చార్జర్ పాయింట్, మరోవైపు డ్రైన్ హోల్స్ ఉంటాయి. వాటి ద్వారానే బ్రష్‌లోని తడి బయటికి పోతుంది.

## రెండు దేశాల మధ్యలో హోటల్

సాధారణంగా ఏ బిల్డింగ్‌కైనా చిరునామా ఒకటే ఉంటుంది. కాని యూరప్‌లోని ఒక భవనానికి రెండు దేశాల చిరునామాలున్నాయి. అందులో ఒకటి స్విట్జర్లాండ్ చిరునామా కాగా, మరొకటి ఫ్రాన్స్ చిరునామా. ఎందుకంటే ఆ భవనం రెండు దేశాల సరిహద్దు రేఖపై ఉంది. అంటే రెండు దేశాల మధ్యలో ఉంది.ఆ భవనంలోనే చాలాకాలంగా ఆర్బేజ్ అనే పేరుతో ఒక హోటల్ నడుస్తోంది. జెనీవాకు అయిదు మైళ్ల దూరంలో సరిహద్దు పట్టణమైన లా క్యూర్‌కు సమీపంలో ఉంటుందీ హోటల్. అంతర్జాతీయ సరిహద్దుపై ఉన్న ఏకైక హోటల్‌గా గుర్తింపు పొందింది. డైనింగ్ రూమ్ సరిగ్గా సరిహద్దు గీతపైనే ఉంటుంది. కొన్ని టేబుళ్లు స్విట్జర్లాండ్ వైపు, మరికొన్ని టేబుళ్లు ఫ్రాన్స్‌వైపు ఉంటాయి.



బిల్డింగ్‌పైన ఒకవైపు స్విట్జర్లాండ్ జెండా, మరోవైపు ఫ్రాన్స్ జెండా కనిపిస్తుంది. హోటల్‌కు వచ్చినవారు స్విట్జర్లాండ్ దేశంలో టిఫిన్ చేసి, ఫ్రాన్స్ దేశంలో కాఫీ తాగుతారు. హోటల్ గది మంచంపై పడుకుంటే తల స్విట్జర్లాండ్‌లో, కాళ్లు ఫ్రాన్స్‌లో ఉంటాయి. 1862లో స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ దేశాలు సరిహద్దు రేఖలను మార్చుకోవాలని ఒక ఒప్పందానికి వచ్చాయి. అప్పటికే ఉన్న కట్టడాలను కూల్చకూడదన్న ఒప్పందం చేసుకున్నాయి. కొవిడ్ సమయంలో సరిహద్దులు మూసివేసినప్పుడు కూడా ఈ తహోటల్ తెరిచే ఉంది. రెండు దేశాల సరిహద్దులో ఉండటం వల్ల ఈ హోటల్‌ను చూసేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతారు.

## బార్బీ టైప్ 1 డయాబెటిస్



చూడముచ్చటగా ఉండే బార్బీ బొమ్మ అంటే పిల్లలకు ఎంత ఇష్టమో చెప్పలేం. ఆ బొమ్మతో ఆడుకునేందుకు పిల్లలు ఆసక్తి చూపిస్తారు. అలాంటి బొమ్మకు టైప్ 1 డయాబెటిస్ ఉంటే.. అదేమిటి..? బొమ్మకు డయాబెటిస్ ఏమిటి? అని ఆశ్చర్యపోతున్నారా? ఈ మధ్య వస్తున్న బార్బీ బొమ్మ నీలంరంగు పోల్కీ చుక్కల డ్రెస్‌తో అందంగా ఉన్నా, దాని నడుముకున్న ఇన్సులిన్ పంప్, గ్లూకోజ్ మానిటర్, స్మార్ట్‌యాప్ వంటివి ఆలోచింపచేస్తాయి. ఈ బొమ్మను చూడగానే ఈ మానిటర్ ఏంటి, టైప్ 1 డయాబెటిస్ ఏమిటి? అనే ఆలోచన వస్తుంది. అలా ఆలోచించాలన్న ఉద్దేశంతో బ్రేక్‌త్రూ టి1డి అనే స్వచ్ఛంద సంస్థ బార్బీ బొమ్మలు తయారు చేసే మేటెల్ కంపెనీతో కలిసి ఈ బార్బీని రూపొందించింది. ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది పిల్లలు టైప్ 1 డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. కానీ ఈ వ్యాధిపైన సరైన అవగాహన లేకపోవడం, పరిశోధనలు చేసే సంస్థలకు తగినంత నిధులు లేకపోవడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని బ్రేక్‌త్రూ సంస్థ ఈ బొమ్మని తయారు చేసింది.. ఇలా అయినా ఈ వ్యాధిపైన దృష్టిపెడతారని.

# ప్రేమంటే..!?



**ప్రాణం పోసేది ప్రేమ !**
**ప్రాణం తీసేది రుగ్మత !**

చిత్తూరు జిల్లా పెనుమూరు మండలంలో ప్రేమ కోసం 17 యేళ్ల మైనర్ బాలుడు ప్రాణం తీసుకున్నాడు. ఇంటర్ చదువుతున్న అతను తన తరగతిలో చదివే 18 యేళ్ల యువతి ప్రేమించుకున్నారు. ఇద్దరు కలసి జీవితం పంచుకోవాలని ఇల్లు వదలి వెళ్ళిపోయారు. యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నాలుగు రోజుల తరువాత విజయవాడలో పట్టుకున్నారు. పోలీసు స్టేషన్‌కు తీసుకుని వచ్చి మైనర్ ను తీసుకుని వెళ్లడం నేరమని అమ్మాయిని మందలించారు. మైనర్ పెళ్లి చేసుకుంటే చెల్లదని అబ్బాయికి చెప్పారు. ఇద్దరికీ కౌన్సెలింగ్ చేసి తల్లితండ్రులకు అప్పగించారు. అయితే అబ్బాయి రెండు రోజుల తరువాత "ఆ పిల్ల నన్ను మోసం చేసింది, తట్టుకోలేక పోతున్నాను.." అంటూ లేఖ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు.

సమాజంలో అప్పుడప్పుడు జరుగుతున్న ఇలాంటి సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ఆధునిక యువతలో కొందరికి ప్రేమంటే అర్థం తెలియడం లేదు. వ్యామోహాన్ని ప్రేమని భ్రమిస్తున్నారు. హార్మోన్ల విపరీత ప్రభావంతో వివేకం నశించి ప్రవర్తిస్తున్నారు. ఉన్మాదం తలకెక్కినవారు ప్రేమ తిరస్కారాన్ని సహించలేక దాడులు, హత్యలకు పాల్పడుతున్నారు. బలహీన మనస్కులు డిప్రెషన్‌కు గురై ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారు.

## ప్రాణం పోసేది ప్రేమ

ప్రేమ పవిత్రం, సృష్టికి మూలం. ప్రేమ ప్రాణం పోస్తుంది. ప్రేమకు మానవ జీవితంలో అత్యంత విశిష్ట స్థానం ఉంది. అది మనిషిని మానవత వైపు నడిపించే శక్తి. నిజమైన ప్రేమ హృదయాలను కలిపి, ఆత్మలను బంధిస్తుంది. ప్రేమకు ఎల్లలు, తీరాలు, సరిహద్దులు లేవు. ప్రేమ అంటే మనసు లోపల వెలిగే దీపం, అది చీకటిని తొలగిస్తుంది. ప్రేమ అంటే మరొకరి ఆనందంలో మన ఆనందం కనుగొనడం.

ప్రేమ అంటే మనసులో క్షమ, కరుణ, అర్థం చేసుకునే మనసు పెంపొందించుకోవడం. ప్రేమ పరిచయంతో ప్రారంభం అవుతుంది. స్నేహంతో బలపడుతుంది. మానసిక సాన్నిహిత్యంతో బంధంగా గట్టి పడుతుంది. ఇందులో ఇష్టం, సహనం, ఓర్పు, త్యాగం, సర్దుబాటు, స్వీకరణ, సహకారం లాంటి గుణాలు దాగి ఉంటాయి.

స్త్రీ పురుషుల మధ్య ప్రేమలో అంతర్లీనంగా కోర్కెలు దాగుంటాయి అనడంలో సందేహం లేదు. ఆ కోర్కెలే సృష్టికి మూలం. అయితే అవి విపరీతం అయితే మాత్రం ప్రేమ దారి తప్పి ప్రమాదం ఉంటుంది. ప్రేమలో శారీరక సంబంధాలకు ప్రాధాన్యత ఉంటుంది తప్ప, శృంగారమే ప్రేమ కాదు. ఈ సున్నితమైన అంశం నిజమైన ప్రేమికులకు అర్థం అవుతుంది. నిరంతరం సెలయేరులా సాగిపోతుంది.

## ప్రాణం తీసేది రుగ్మత

ఆధునిక యువతలో కొందరు మోహాన్ని ప్రేమగా భావిస్తున్నారు. సహజంగా యవ్వనంలో స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ కలిగించే హార్మోన్లు అభివృద్ధి చెందుతాయి. దీని ప్రభావంతో ఒకరి పట్ల ఒకరు ఆకర్షితులు అవుతారు. అయితే సమాజంలో చట్టాలు, నియమాలు, నిబంధనలు, ఆచారాలు, వ్యవహారాలు ప్రేమను నియంత్రిస్తుంటాయి.

ఆశయాలు, ఉద్యోగం హోదా లాంటివి ప్రేమను ప్రభావితం చేస్తుంటాయి. అయితే ఇవేవీ పట్టించుకోకుండా కొందరు ప్రేమలో పడుతుంటారు. అవరోధాలు ఎదురైనప్పుడు విపరీతంగా ప్రవర్తిస్తుంటారు. ఇలాంటి వారిలో మానసిక రుగ్మతలు దాగి ఉంటాయని పలు సందర్భాలలో రుజువయ్యింది. ఉన్మాదం తలకెక్కినవారు దాడులు, హత్యలకు పాల్పడుతుంటారు. బలహీన మనస్కులు డిప్రెషన్‌కు గురై ఆత్మహత్యలకు పాలడుతుంటారు. ప్రేమ పేరుతో నేరాలకు పాల్పడే వారిలో ప్రవర్తనా లోపాలు, హింసా ప్రవృత్తి, బైపోలార్ డిసార్డర్, సైకోసిస్, స్కిజోఫ్రేమియా రుగ్మతల లక్షణాలు ఉంటాయి. వ్యసనపరులు కూడా విపరీత ధోరణి ప్రదర్శిస్తారు. ఇలాంటి వారిని సకాలంలో గుర్తించి కౌన్సెలింగ్, చికిత్స చేయించాలి.

**– డాక్టర్ ఎన్.బి. సుధాకర్ రెడ్డి**

కథ

# గమనం గాడి తప్పాక

వడలి రాధాకృష్ణ

**ఎన్నో ఏళ్ల తర్వాత కలిసిన సందర్భం కావడంతో కమనీయంగా ఉంది. పాతిక సంవత్సరాల తర్వాత కలిసిన గౌతమీ కాన్వెంటు స్కూలు విద్యార్థినీ విద్యార్థుల అపురూపమైన సమ్మేళనం ఇది.**

**గోడకు తగిలించిన ఫ్లెక్సీలు అదే మాటను చెబుతున్నాయి. అప్పటి విద్యార్థులందరూ ఒక్కొక్కరుగా విచ్చేస్తూ ఉన్నారు.**

"భువన మూర్తి సారూ..."

"వచ్చే వేళయింది!"

"అసలు వస్తారంటావా!!"

"అదేం మాట, ప్రిన్సిపాల్ సారు ఈ సమావేశానికి రాకపోతే దీనికి కళాకాంతులు ఉండవు" విస్సు మాటలు మంచి కాన్ఫిడెన్స్‌గా ఉన్నాయి.

"ఆయన తెనాలిలో ఉదయాన్నే బయలుదేరినారు. మరో అర్ధ గంటలో గూడూరుకి విచ్చేస్తారు."

"కళాకాంతులంటున్నావు. మన క్లాస్‌మేట్స్ కళాప్రభ, లక్ష్మీకాంతిలు వచ్చినట్లు లేదు, "గురుకర్ అటూ .. ఇటూ చూస్తూ పాత స్నేహితురాళ్ల గురించి ఆరా తీస్తున్నాడు.

"సరిగ్గా మాకు అక్కడే మండుతుంది. కళాకాంతులు అందరికన్న ముందరే వచ్చేశాయి. మీకు ఇక్కడ టిఫిన్లు, కాఫీలు క్రమం తప్పకుండా అందుతున్నాయంటే ఈ కళాకాంతుల సేవాభాగ్యమే"




అప్పట్లో గౌతమీ కాన్వెంట్ స్కూల్‌లో కళాప్రభ, లక్ష్మీకాంతిలు క్లాస్‌మేట్స్ మాత్రమే కాక, ఫస్ట్ బెంచ్‌మేట్స్ కూడాను. మరెవరయినా ముందుగా వచ్చి మొదటి బెంచి మీద కూర్చున్నారంటే తగవు పెట్టుకొని మరీ పక్కకు లాగి పారేసేవారు వారిద్దరూ. ఇన్నాళ్ళ తర్వాత కూడా ఐక్యతా రాగాన్ని ఆలపిస్తున్నారు. చేయి చేయి కలిపి కాఫీలు, టిఫిన్‌లు సర్వ్ చేస్తూ ఉన్నారు.

"వీరి నోళ్లలో నోరు పెట్టరాదని ఈ క్లాస్‌కు లీడర్‌గా అందరికీ హెచ్చరిస్తున్నాను!" నకుల్ అనాల్సిన మాటల్ని అనేసి, పకపకా నవ్వుతున్నాడు.

"అవును... నకుల్ ఆనాడు తమ తరగతికి క్లాస్‌లీడర్. అదేమి చోద్యమోగాని ఎవరూ అతగాడి మాట వినేవారు కాదు. తన చెప్పుచేతల్లో ఇమిడిపోయి ఉంటాడని క్లాస్ టీచర్ మోహనమూర్తి గారు ఆనాటి నకుల్‌ని క్లాస్ లీడర్‌గా ఎంపిక చేసుకున్నారు.

కానీ ఎడ్డెమంటే తెడ్డెమనే కుర్రకారుతో నెగ్గుకురావడం నకుల్‌కు ఎప్పుడూ తలకి మించిన భారమే అయ్యేది. నకుల్‌కి ఇప్పుడూ అదే పరిస్థితి.

ఒకటి రెండు సార్లు క్లాసును అదుపులో పెట్టలేకపోయిన పాపానికి ప్రిన్సిపాల్ భువనమూర్తి సారు క్లాస్ లీడర్‌ను బెంచి ఎక్కించిన సందర్భాలు లేకపోలేదు. ఆనాటి నకుల్‌గాడు ఇప్పుడు గెయిల్ సంస్థలో సీనియర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. మరల అతగాడు ఇన్ని సంవత్సరాల తర్వాత క్లాస్‌ను అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్నాడు.

"బోయస్‌గానీ, గరల్స్‌గానీ వినడం లేదు. "ఝాన్సీ మేడమ్ విచ్చేశారండ్రో!" సాహితీ పిలుపుతో అందరూ అటు తిరిగారు.

"గుడ్ మార్నింగ్ టీచర్!" అందరూ అదే పనిగా లేచి నిల్చొని గుడ్ మార్నింగ్ చెబుతుంటే ఆవిడ ఉబ్బి తబ్బిబ్బయిపోతోంది.

"తినడానికి ఏమి తెచ్చేసినారు టీచర్!" కరుణ తమ ప్రియమైన సైన్స్ టీచర్‌ని ప్రియతమంగా అడుగుతూ ఉంది.

"సైలెన్స్.. మై డియర్ స్టూడెంట్స్! ఝాన్సీ టీచర్ మాటలు ఆకట్టుకుంటుంటే నోటిలో సగం ఊడిపోయిన ఆవిడ పలువరుసలు చూసిన అక్కడ అందర్నీ చివుక్కుమనేలా చేస్తున్నాయి. ఎవరు వచ్చినా రాకపోయినా సైన్స్ టీచర్ క్లాస్‌కు మానకుండా రావాలని అప్పట్లో అందరూ కోరుకునేవారు. కారణం ఝాన్సీ మేడమ్ తరచుగా పిల్లలందరికీ ఏవో ఒకటి తినడానికని ఇంట్లో తయారు చేసి తీసుకొచ్చి క్లాసుల్లో పంచి పెట్టేవారు.

పిల్లలు లేని ఆవిడకు అప్పట్లో సరదా!

"తినడానికి ఇప్పుడు ఏమిటి తెచ్చినారు మేడమ్!"

"తేచ్చేదాన్నే! తిని తిని నా పళ్లు ఇలాగ అయిపోయినాయి. మీరు నాలాగ కాకూడదని..." ఆవిడ తన పళ్ళూడిపోయిన బోసినోరును గొప్పగా చూపిస్తూ అంటోంది.

ఆవిడ మాటలు కొంత చతురతను కల్గిస్తున్నాయి.

"మేమేమీ తక్కువ తినలేదు మేడమ్! కావాలంటే మా నోర్లు సరి చూసుకోండి!!"

ప్రభావతి నోరు తెరిచింది. ఇప్పుడిప్పుడే ఊడుతున్న పళ్లు అందరికీ నవ్వు తెప్పిస్తున్నాయి.

ఆ వేదిక ప్రాంతమంతా పూర్వపు విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయుల సందడితో నిండిపోయి ఉంది. అనుభూతులు, పెనవేసుకున్న అభిమానాలతో పసందుగా అన్పిస్తోంది.

ఉన్నట్టుండి అందరూ అప్పటి కొంటె కోణంగిలయిపోతున్నారు. పరీక్షలకు ముందు చదువు మీద శ్రద్ధాసక్తుల్ని పెంచుకుని బుద్ధివంతులయిపోతున్నారు. పరీక్షలయిపోయిన తర్వాత అల్లరి చేస్తూ ఎగిరెగిరి పడే రంగు రంగుల సీతాకోక చిలుకలైపోతున్నారు.

"భువనమూర్తి సారు వచ్చేశార్రో.."

"మన ప్రిన్సిపాల్ సారు తెనాలి నుండి విచ్చేశార్రోయ్" నాగూల్ బల్ల మీద దరువు వేసి మరీ చెబుతున్నాడు.

ఆడిటోరియంలోకి విచ్చేసిన భువనమూర్తి సారు దంపతులను ఎదురేగి స్వాగతిస్తున్నారు. ఆనక పూలవర్షాన్ని కురిపిస్తున్నారు. ఆయన అందర్నీ ఆప్యాయంగా పలకరిస్తున్నారు. తమ గౌతమీ స్కూల్‌లో చదువుకొని ప్రయోజకులయిన వారి నందర్నీ చూసి మురిసిపోతూ ఉన్నారు. అందరూ తమను, తమ కుటుంబ సభ్యులను సభకు పరిచయం చేసుకుంటున్నారు.

అలనాటి బాల్యం తాలూకు అపురూపమైన సందర్భాలను తలుచుకొని పరవశించిపోతూ ఉన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అలనాటి తమ గురువులను ఉచిత రీతిన కొనియాడుతున్నారు.

భువనమూర్తికి చాలా ఆనందంగా ఉంది. తమ స్కూల్‌లో పనిచేసిన ఉపాధ్యాయులకయితే మరీను. ఈ వయసులో వీళ్లందరూ కలిసి ఏర్పాటు చేసిన సత్కార కార్యక్రమం తమను పరవశించిపోయేలా చేస్తూ ఉంది.

"అందరూ పిలవగానే ఈ ఆత్మీయ సమావేశానికి విచ్చేశారు. మన గున్నారావు గాడు ఒక్కడే రాలే" విస్సు మాటలు అక్కడ అందరికీ గున్నారావును గుర్తుకు తెస్తున్నాయి.

"గున్నారావు ఇక్కడ గూడూరులోనే ఉన్నాడట, తెలుసా మీకు. పాపం ఈ మధ్య వాడి ఆరోగ్యం బాగా దెబ్బతిందని విన్నాను."

"పాపం గున్నారావు.." గౌతమీ స్కూల్ గూడూరులో గున్నారావు తమ బ్యాచ్‌మేట్! చదువులో ఎప్పుడూ వెనకబడి ఉండేవాడు. చెప్పాలంటే పెద్దతేభ్యంలాగ, ఏమీ తెలియని అమాయక ప్రాణిలాగ, చాలా అయోమయంగా ఉండే మనిషి వాడు.

"ఈ సన్నాసిగాడికి చదువెందు కండీ! ఇలాంటి వాళ్లు క్లాసులో ఒకరిద్దరు ఉన్నారంటే స్కూల్ పాస్ పర్సంటేజి గంగలో కలిసిపోతుంది. టీసీ ఇచ్చివాడిని ఇంటికి పంపేయండి!!" భువనమూర్తికి కొంతమంది మిత్రులు ఆనాడు సలహా ఇచ్చారు.

కానీ భువన మూర్తి వాడికి నాలుగు అక్షరాలు బోధించి ప్రయోజకుణ్ణి చేయడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. దానికితోడు అతగాడి తల్లిదండ్రులు కూడా అంతంతమాత్రపు మనుసులు. ఏదో కూలీ నాలీ చేసుకొని పొట్ట పోసుకొనే తత్వం వారిది. "గున్నారావు ఇక్కడ గూడూరులోనే ఏదో ఫ్యాక్టరీలో కూలీ ఉద్యోగానికి చేరినాడట.

**"అందరూ పిలవగానే ఈ ఆత్మీయ సమావేశానికి విచ్చేశారు. మన గున్నారావు గాడు ఒక్కడే రాలేదు" విస్సు మాటలు అక్కడ అందరికీ గున్నారావును గుర్తుకు తెస్తున్నాయి.**

అక్కడ వాతావరణం కూడా అంతగా పడక ఆరోగ్యం బాగా దెబ్బతిన్నదట. పైగా అక్కడ వాడికి ఏదో ప్రమాదం జరిగిందని కూడా విన్నాము. దానితో ఎక్కడికీ కదలలేకపోతున్నాడు. ఈ మధ్య కాలంలో వాడి అమ్మా నాన్నలు కూడా కన్నుమూయడం వాడికి మరో కోరుకోలేని దెబ్బ"

"వాళ్ళూ వీళ్లూ కాసింత తిండి పారేస్తే తినేసి అలా దీనంగా బతుకుతున్నాడు" గురుకర్ గున్నారావు గురించి విషయాలన్నింటినీ వివరంగా చెబుతున్నాడు.

"అయితే ఈ ఫంక్షన్ అయిన తర్వాత అందరం వెళ్లి వాడిని పరామర్శించి రావల్సిందే"

... ... ...

భువనమూర్తి మనసు ముప్పిరిగొని కొంత ఆహ్లాదాన్ని అనుభవిస్తూ ఉంది. మొన్న గూడూరు వెళ్లి వచ్చినప్పటి నుండి తెగ సంబరపడి పోతున్నాడు. తన భార్య కరుణ అయితే అసలు చెప్పనవసరం లేదు. తమ స్టూడెంట్స్ అందరూ తమపై చూపిన ఆదరాభిమానాలను తల్చుకొని పొంగిపోతూ ఉంది.

ఒక్కసారి చవన్‌కుమార్ మనసులో మెదిలాడు. కొడుకు కళ్లల్లో మెదిలే సరికి గుండె బావురుమంది. ఆటపాటల్లో, చదువు సంధ్యల్లో వాడు ఎప్పుడూ ముందుండేవాడు. మంచి మార్కులతో అన్ని పరీక్షలు పాసయి గొప్ప ప్రయోజకుడు అవుతాడన్న సమయంలో అనుకోని రీతిగా వాడికి లివర్‌కు సంబంధించిన వ్యాధి సోకింది.

ఆ కారణంగా కిడ్నీకి బాగా ఎఫెక్ట్ అయిపోయింది. ఆ వయసులో పెళ్లి చేసుకొని పిల్లాపాపలతో ఆనందంగా బ్రతకాల్సిన కొడుకును అలా చూసి తల్లడిల్లిపోయాడు భువనమూర్తి. కరుణ అయితే మరీను. ఆమె మొక్కని దేవుడు లేదు. కొలవని దేవతా లేదు.

కొడుకుని ఆ స్థితిలో చూసుకొని కంటిమీద కునుకు లేకుండా బతికింది. చవన్‌కుమార్‌కి కిడ్నీని మార్చాల్సి వచ్చింది. లేకపోతే బ్రతకడం కష్టమన్నారు. దానితో ఎంత ఖర్చయినా వెనకాడకుండా కొడుకుని కాపాడానికి ప్రయత్నించాడు. మొదట్లో తన కిడ్నీని ఇద్దామనుకున్నాడు కానీ వయసురీత్యా వలదన్నారు. కరుణ ఇవ్వాలని ప్రయత్నించింది. కానీ వల్ల కాదన్నారు. దానితో బయట వ్యక్తుల కిడ్నీకోసం ప్రయత్నించారు. అప్పుడు తన దగ్గర చదువుకున్న గున్నారావు అనుకోకుండా తారసపడ్డాడు.

చెప్పాలంటే అప్పుడూ ఇప్పుడూ ఎల్లవేళలందూ గున్నారావంటే తనకు చిన్నచూపే. అనాడు వెర్రిగా వెంపర్లాడే ఆ అమాయక ప్రాణి చేత ఇంటి పనులన్నీ చేయించుకొనేవాడు. బయట నుండి సామాన్లు తెప్పించుకోవడాలు, బయట ఊర్లలో చిల్లర పనులపనులేమయినా ఉంటే పురమాయించడాలు..


చవన్‌కుమార్‌ను హాస్పిటల్‌లో పెట్టినపుడు నెలల తరబడి కొడుకు సపర్యలకోసం వాడిని ఎక్కువగా వినియోగించుకోవడం చేస్తూ ఉండేవాడు.

చెప్పాలంటే గున్నారావు తన దృష్టిలో ఒక అనామకుడు. వాడి తల్లిదండ్రులు కూడా అలాగనే ఉండటంతో భువనమూర్తి అందర్నీ ఎడా పెడా ఉపయోగించుకుంటూ ఉండేవాడు. అలాగని ఆర్థికంగా వాళ్లకు సహాయం చేసింది కూడా ఏమీ లేదు.

ఏనాడు తన గురువుగారి మాటకు ఎదురు చెప్పలేదు వాడు. అంతే కాకుండా తమ మాస్టారుకి వచ్చిన కష్టాన్ని చూసి నొచ్చుకున్నాడు. కావాలంటే తన కిడ్నీని ఇవ్వడానికి ముందు కొచ్చేశాడు.

పరీక్షలు చేయిస్తే గున్నారావు కిడ్నీ చవన్‌కుమార్‌కి సరిపోతుందని చెప్పారు డాక్టర్లు.

ఆ అవకాశాన్ని బాగా ఉపయోగించుకున్నాడు భువనమూర్తి. ఇతగాడి కిడ్నీ చవన్‌కుమార్‌కి అమర్చడం జరిగిపోయింది. ఏదో చిన్న మొత్తంలో డబ్బు ఇచ్చి సర్దుబాటు చేసేశాడు. కొంతకాలం తర్వాత చవన్‌కుమార్‌కి ఇన్‌ఫెక్షన్ సోకింది. కథ మరల మొదటికొచ్చేసింది. ఈసారి తీవ్రమైపోవడంతో కొడుకు భువనమూర్తికి కాకుండా పోయాడు.




కొడుకు మరణం భువనమూర్తి, కరుణ దంపతులను బాగా కుంగదీసింది. ఆ వ్యాధితోనే చాలా కాలం మంచం పట్టేశాడు. భార్యా భర్తలు ఇంటికే పరిమితమైపోయారు. తదుపరి కాలంలో తాము నడుపుతున్న గౌతమీ కాన్వెంట్ స్కూల్‌ను మరొకరికి అప్పగించేశాడు. తమ బంధువులందరూ ఎక్కువగా నివసించే తెనాలికి మకాం మార్చేశాడు.

మరలా చాలా సంవత్సరాల తర్వాత ఈ మధ్యన గూడూరుకు వెళ్లడం జరిగింది. అదీ అప్పటి స్కూలు విద్యార్థులు అందరూ కలిసి కట్టుగా ప్రాధేయపడటంతో వెళ్లక తప్పింది కాదు. కొన్ని కొన్ని అనుభూతులు తమను సంతోషపరిచినా, కొడుకు అకాల మరణం తమను వేధిస్తూనే ఉంది.పైగా తన కొడుక్కి అడగ్గానే ఏమాత్రం సంశయించకుడా అవయవ దానం చేసిన గున్నారావు ఇంటికి వెళ్లి పరామర్శించి వచ్చిన తర్వాత, ఆ ఆవేదన మరీ తీవ్రతరమైపోతూ ఉంది. అక్కడ ఫ్యాక్టరీలో కూలి పనులు చేసుకుంటూ ప్రమాదానికి గురి అయ్యాడన్న అంశం తనను బాగా కలిచి వేస్తోంది ఇప్పుడు.

గున్నారావు తనకు శిష్యుడు. వాడికోసం తాను బాగానే ప్రయత్నించాడు. కానీ చదువుసంధ్యలు అబ్బలేదు. దానితో తనకు లోకువ అయిన మనిషిని ఆనాడు తన స్వార్థానికి ఎంతగానో ఉపయోగించుకున్నాడు. ఇప్పుడు భువనమూర్తికి అంతా అయోమయంగా ఉంది. ఒక అపరాధ భావన తనను ముట్టేస్తోంది. దాని ప్రాయశ్చిత్తం కోసం మార్గాలను అన్వేషిస్తున్నాడు.

ఈ మధ్య గూడూరు వెళ్లివచ్చిన తర్వాత భర్త ధోరణిలో వచ్చిన మార్పును అంచనా వేస్తూనే ఉంది. కానీ అసలు విషయం అర్థంగాక అవస్థ పడుతోంది.

భువనమూర్తి ఇప్పుడు తన నుండి విడివడి మనిషిగా ఆలోచిస్తున్నాడు. "కరుణా! మనవల్లే కదూ ఆ గున్నారావుకి తీవ్రమైన అన్యాయం జరిగింది. అప్పట్లో చదువు లేకపోయినా బాగానే తిరిగిన మనిషి ఇప్పుడు ఇలా.."

"-----" వాడిని మాటలతో మోసపుచ్చిన నయవంచనకు గురి చేసింది నేను! వాడి తల్లిదండ్రులకు తోచిన డబ్బు పారేసి, రెండో కంటికి తెలియకుండా వాడిని లోబరుచుకున్నదీ నేనే!! దానికి ఇప్పుడు కొంత ప్రాయశ్చిత్తం చేయదల్చుకున్నాను'

"-----"

"గూడూరు నుండి గున్నారావును ఇక్కడికి తెచ్చేసుకుందాము! వాడి బ్రతుకు

తాలూకు సంపూర్ణమైన బాధ్యతను మనమే తీసుకుందాం" అప్పుడైనా దేవుడు నన్ను క్షమిస్తాడేమో!!" అని అనుమానంగా భార్య మొహంలోకి చూశాడు. ఆమె ఒప్పుకుంటుందన్న నమ్మకం లేదు తనకు.

"అదే కరుణా!, గున్నారావును మన వారసునిగా స్వీకరింపదల్చుకున్నాను"

"మీ మాటను నేను ఎప్పుడు కాదన్నాను చెప్పండి!! మన కంటి ముందు పెరిగిన కుర్రాడు మనతో కలిసి తిరిగిన మనిషి వాడు. మన చవన్‌కుమార్ వయసున్నవాడు మీరంటే గున్నారావుకు ఇప్పటికీ చాలా ప్రేమాభిమానాలున్నాయి"

"-----"

"వాడిని ఆ స్థితిలో అలా చూడడం ... తల్చుకుంటే నా గుండె తరుక్కుపోతోంది! గున్నారావు ఇక నుండి మన ఇంటి మనిషి.. మన మనిషి!!" కరుణ మాటలు చాలా దృఢంగా ఉన్నాయి. భార్య తాలూకు 'కరుణార్ణవ అంతరంగ స్పర్శ తనను ఇప్పుడు ఎంతగానో సేద దీరుస్తూ ఉంది. "అవును. అతగాడిని వెంటనే తెనాలికి రప్పించాలి. గున్నారావు మనతో ఉండి తీరాలి..."

హిస్టీరియా వచ్చిన వాడిలాగ మాట్లాడుతున్నాడు భువనమూర్తి. తన ఈ డెబ్బై ఐదు ఏళ్ల వయసులో ఈ నిర్ణయం అలవికాని సంతృప్తినిస్తూ ఉంది ఆయనకు. ✦

# బుల్లి తెరాయణం

పుస్తక సమీక్ష

"నేర్వాలి అంటే ముందు నేర్వాలి" అని బలంగా విశ్వసిస్తారు రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి. స్వయంగా బడి నడిపి, అటు బోధనా రంగాన్ని, ఇటు అధ్యయన రంగాన్ని లోతుగా శోధించారు. విశ్లేషణాత్మక దృష్టితో పరిశీలించటం వీరి ప్రత్యేకత. ఆ ప్రత్యేకతే వీరి చేత అటా(వలస దేవర-నవల) సంయుక్త ఆం.ప్ర. ప్రభుత్వ నవలల పోటీ(జంగమదేవర) కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం(భలే తాత మన బాపూజీ-కన్నడ నవల) లాంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాల్ని గెలిపించింది. ఈటీవీ కన్నడ చానల్, మాటీవీ తెలుగు చానళ్లలో పనిచేసిన అనుభవాన్ని పురస్కరించుకుని ప్రస్తుత నవల 'సాక్షాత్కారం' రాసారు. ప్రణీత్, ప్రతీక.. నవలలోని ముఖ్య పాత్రలు. ఇద్దరూ సీరియల్ కార్యక్రమాలు రూపొందిస్తుంటారు. వివాహ వ్యవస్థ మీద అంతగా నమ్మకం లేకపోవటం వల్ల 'సహజీవనం' వైపు మొగ్గుచూపిన బుద్ధిజీవులు. సంతానలేమి వీరిద్దరినీ, ముఖ్యంగా ప్రతీకను బాధిస్తూ ఉంటుంది. సంతానప్రాప్తికై ప్రతీక అడ్డదార్లు తొక్కుతుంది. అయినా ఫలితం ఉండదు.



టీవీ 'సీ.రియల్' కార్యక్రమం రూపొందించటంలో లేనివారు ఎదుర్కొనే అవిద్య, ఆర్థికలేమి వీరిద్దరికి ఎన్నో పాఠాలు నేర్పుతుంది. అనాథ శరణాలయంలోని ఓ పాపను తెచ్చి పెంచుకోవటంతో నవల ముగింపు పలికినా, 'సహజీవనం'లోని ఎన్నో లోటుపాట్లు వీరు చర్చకు పెట్టారు. బుల్లితెర వ్యవస్థలోని లోటుపాట్లు, తీరుతెన్నులు, రచయిత వివరణలు పాఠకులకు ఎంతో విజ్ఞానదాయకంగా ఉంటుంది.

**(సాక్షాత్కారం(నవల)-రచన: జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి; వెల: రూ.250/-; ప్రతులకు: పాలపిట్ట బుక్స్; ప్రముఖ పుస్తక కేంద్రాలు)**

**- కూర చిదంబరం**

---

## జీవన ప్రస్థాన మనో విహారం

'మనో విహారి', 'మానవ జీవనయానంలోని అయిదు పార్శ్వాలను జీవన ప్రతిధ్వనులుగా అవలోకించే, కవితా సంకలనం. దినకరరావు పసుపులేటి, అద్భుతంగా, ధ్వనింపచేసిన ఈ జీవన భావలహరి ఆంగ్లమూలానికి, కస్తూరి రాజశేఖర్ తెలుగుసేత అందించారు. ఒక హృదయంలో జనించి కవితగా రూపుదిద్దుకొన్న అనుభవైక వేద్యమైన రసానుభూతిని మరొకరు, మరొక భాషలో అనుభవింపచేసే అరుదైన ఆ ప్రక్రియ కేవలం అనువాదం అనిపించుకోదని, తెలుగుసేత అందించిన రాజశేఖర్ 'అనుసృజనాత్మక' ప్రతిభ స్పష్టం చేస్తోంది. ఆంగ్లమూల కవితాత్మను రాజశేఖర్ ఒడిసిపట్టుకొని, తెలుగు



కవితాప్రియులను తన్మయింపచేసారు. దైవం-సృష్టి, తొలిప్రేమ-అనుబంధం, అన్వేషణ-వేదన, అనుభవం-విజ్ఞత, వార్ధక్యం-మరణం అధ్యాయాలుగా ఈ జీవన ప్రస్థాన భావలహరి నడుస్తుంది. మానవుని జీవన ప్రయాణంలోని అధ్యాయాలను ఆంతరంగిక అనుభవైక వేద్యంగా సృజన, మానవీయత, అనుభూతివాదం, ఆశావాదం ప్రతిబింబింపచేసిన 'మనో విహారి, ఆంగ్ల, తెలుగు కవులు దినకరరావు, రాజశేఖర్‌లు అభినందనీయులు.

**(మనో విహారి-రచన:ఆంగ్లమూలం: దినకర రావు పసుపులేటి; తెలుగుసేత:కస్తూరి రాజశేఖర్; ప్రతులకు: కస్తూరి నాగేశ్వరరావు, ప్లాట్ నం.301, సిరి నిలయం, కాకతీయ నగర్, రోడ్డు నం.3, హబ్సిగూడ, హైదరాబాద్-500 007)**

---

## 'భారత భారతి'-డా॥ ఆచార్య ఫణీంద్ర

తెలుగు మహాభారత రచనారంభ సహస్రాబ్ది సందర్భంగా, డా॥ ఆచార్య ఫణీంద్ర యువభారతి ప్రచురణగా, కవిత్రయ మహాభారతంలోని 40 పద్యాలను ఎంపిక చేసి 'భారత భారతి'గా వెలువరించటం ఎంతైనా ప్రశంసనీయం. సాహితీ వారసత్వ విలువల సమాహారం అయిన యువభారతి ద్వారా భారత భారతి సాక్షాత్కరింపచేసిన డా॥ ఆచార్య ఫణీంద్ర, మన మాతృభాషకు అటు సంప్రదాయ యిటు నవీన సాహితీ రీతులలో కవిగా, పరిశోధకునిగా, విమర్శకునిగా ఎనలేని సేవలందిస్తున్న ప్రతిభాశాలి. నన్నయ, తిక్కన, ఎర్రాప్రగడ కవిత్రయ పద్య పదార్చనతో 'భారత భారతి', దేశ కాలమాన స్థితిగతులకు అతీతంగా సార్వకాలిక అభ్యుదయాన్ని అందిస్తోంది. ఏర్చికూర్చిన ఈ పద్యమాలలోని అక్షర రమ్యత, కవితాధార, అనుప్రాస చాలనం వంటి అద్భుత విశేషాలు ఎన్నో తరువాతి తరాల కవులకు స్ఫూర్తిని యిచ్చిన వైనాన్ని డా॥ ఫణీంద్ర వ్యాఖ్యా పరంగా ప్రదర్శింపచేసారు. ఆచార్య సినారె, కవి ఆరుద్ర అడుగుజాడల్లో వెలుగు చూసిన 'భారత భారతి', యువభారతి వ్యవస్థాపక ప్రముఖ సాహితీ సహృదయులు డా॥ వంగపల్లి విశ్వనాథం అంకిత ధన్యత, ఎంతైనా సన్మాన ఆదరణీయం.

**(భారతీ భారతి-కవిత్రయ మహాభారత పద్యమణులకు హృద్య వ్యాఖ్య)-రచన: డా॥ ఆచార్య ఫణీంద్ర; ప్రతులకు: శ్రీమతి జి.సావిత్రి, శ్రీకరం, 6-34/48/1, బాలాజీనగర్ కాలనీ, దమ్మాయిగూడ, హైదరాబాద్-500 083).**

**- జయసూర్య**

# హిమాలయాల రాణి.. సిమ్లా

**భారతదేశంలోని రాష్ట్రాల్లో ఒకటి హిమాచల్ ప్రదేశ్. మంచుతో కప్పబడిన పర్వతాలు అధికంగా ఇక్కడ కనిపిస్తాయి. ఏడాదిపాటూ ఇక్కడ మంచు పర్వతాలు దర్శనమివ్వడం వలన దీనికి హిమాచల్ ప్రదేశ్ అనే నామం సార్థకమైంది.**

ఒకప్పుడు ఇది కేంద్రపాలిత ప్రాంతంగా వుండేది. అయితే 25 జనవరి 1971లో భారతదేశపు 18వ రాష్ట్రంగా ఏర్పాటైంది. దీని రాజధాని నగరం సిమ్లా. ఇది ఉత్తర భారత రాష్ట్రమైన హిమాచల్ ప్రదేశ్‌కు రాజధాని మాత్రమే కాదు దేశంలోని అత్యంత ప్రసిద్ధ హిల్ స్టేషన్లలో ఒకటి. సిమ్లా పేరు వినగానే మంచుతో కప్పబడిన పర్వతాల సుందర దృశ్యాలు గుర్తుకు వస్తాయి. సుందరమైన ప్రకృతి దృశ్యాలు, వలసరాజ్య కాలం నాటి ఆకర్షణలు, ఆహ్లాదకరమైన వాతావరణంతో సిమ్లా పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఇది సముద్ర మట్టానికి సుమారు 2,200 మీటర్ల ఎత్తులో ఉంది. సిమ్లాను ఖీహిమాలయాల 'రాణి'అని కూడా పిలుస్తారు.

బ్రిటిష్ ఇండియా వేసవి రాజధానిగా సిమ్లా ఖ్యాతినార్జించింది. సిమ్లా ఏడాది మొత్తం విలాస కేంద్రంగా విరాజిల్లుతుంది. ఈ నగరాన్ని ఏడు కొండ శిఖరాల మధ్య కొండ చరియలపై అద్భుతంగా నిర్మించారు. అప్పట్లో ఇక్కడ రాజభవనాల నిర్మాణాలు జరిగాయి. ఇక్కడ 1857లో బ్రహ్మాండమైన చర్చి నిర్మించారు. ఒకప్పటి వైశ్రాయి భవనం 1888లో నిర్మించారు. మరో అద్భుత నిర్మాణం గోర్టన్ కోట ప్రాచీన చరిత్రకు అద్దం పడుతుంది. పర్వతాలపై వున్న మంచు కరిగి ఏర్పడిన అద్భుత జలపాతాలు బహుసుందరంగా కనిపిస్తాయి. పంజాబులో ప్రవహించే ఐదు నదుల్లో జీలమ్ నది తప్ప మిగిలిన నాలుగు నదులు ఇక్కడ పుట్టినవే. మానససరోవరంలో పుట్టి ప్రవహించే సట్లేజ్ నది హిమాచల్ ప్రదేశ్‌లో ప్రవహించే నదులన్నింటిలోను అతి పెద్దది.. సట్లేజ్, చీనాబ్, రావి, యమున, బీయాస్ ఇత్యాది జీవనదులు హిమాచల్ ప్రదేశ్‌లో ప్రవహిస్తున్నాయి.

హిమాచల్ ప్రదేశ్ పేరు చెప్పగానే ముందుగా గుర్తుకువచ్చేది దాని ముఖ్యపట్టణం సిమ్లా. మన దేశంలోని ప్రముఖ వేసవి విడుదుల్లో ఒకటిగా భాసిల్లుతోంది. సిమ్లాను కనుగొన్న ఘనత ఆంగ్లేయులకు దక్కుతుంది. బ్రిటిష్ సైనికాధికారి రోస్ 1819లో సిమ్లాను కనుగొన్నాడు. అప్పటి వరకు ఇది అజ్ఞాతంగానే వున్నది. ఎన్నో ఏళ్ళతరబడి ఇక్కడ ఏ నిర్మాణం జరగలేదు. మేజర్ కెన్నెడి 1828లో తొలిసారిగా భవన నిర్మాణం చేసారు. సిమ్లాలో సందర్శించదగిన పర్యాటక ప్రదేశాలు అనేకం ఉన్నాయి.



**మాల్ రోడ్:** దీన్ని సిమ్లా హృదయ భాగం అని చెప్పవచ్చు. షాపింగ్, రెస్టారెంట్లు, కాఫీ షాపులు, హ్యాండీక్రాఫ్ట్ దుకాణాలతో సందడిగా ఉంటుంది. వలసరాజ్య కాలం నాటి భవనాలు, స్థానిక హస్తకళలు, హిమాచల్ వంటకాలను ఆస్వాదించవచ్చు. ఈ వీధిలో వాహనాలకి అనుమతి లేదు. నడుచుకుంటూ వెళ్ళి తిలకించాలి.

**రిడ్జ్:** ఇది సిమ్లా నగర హృదయం. ఇక్కడి నుండి పర్వతాలు, చర్చి, కాలనియల్ బిల్డింగులు అద్భుతంగా కనిపిస్తాయి. మాల్ రోడ్‌కు సమీపంలో ఉన్న ఈ ఓపెన్ స్థలం నుండి హిమాలయాల అద్భుతమైన దృశ్యాలు కనిపిస్తాయి. న్యూ ఇయర్, సమ్మర్ ఫెస్టివల్ వంటి వేడుకలు ఇక్కడే జరుగుతాయి.

**క్రైస్ట్ చర్చి:** 1857లో నిర్మించిన ఈ చర్చి ఉత్తర భారతదేశంలోనే పురాతన చర్చి. గోతిక్ శైలిలో దీన్ని నిర్మించారు. ఇది ఆసియాలో రెండవ పురాతన చర్చి.

**జాఖూ టెంపుల్:** ఇది సిమ్లాలో 2,455 మీటర్ల అత్యంత ఎత్తైన శిఖరంపై నెలకొని ఉన్న హనుమాన్ దేవాలయం. ఇక్కడ 108 అడుగుల భారీ హనుమాన్ విగ్రహం ఉంది. ఇక్కడ నుండి సిమ్లా నగర పరిపూర్ణ దృశ్యం కనిపిస్తుంది.

**వైస్రాయ్ లాడ్జ్:** ఇది బ్రిటిష్ వైస్రాయ్ వేసవి నివాసం, అత్యంత ప్రసిద్ధి చెందిన చారిత్రక స్థలాలలో ఒకటైన వైస్రాయ్ లాడ్జ్ ఇప్పుడు రాష్ట్రపతి నివాస్ అని కూడా పిలుస్తారు.

అందమైన నిర్మాణ శైలి, ఉద్యానవనాలు చూడదగినవి. అబ్జర్వేటరీ హిల్‌పై ఉన్న ఈ చారిత్రక భవనం బ్రిటిష్ వైస్రాయ్ నివాసంగా ఉండేది. ఇప్పుడు ఇది ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీగా ఉంది. దాని అందమైన స్థలాలు, వలసరాజ్య శైలి ఆర్కిటెక్చర్ ఆకర్షణీయం. ఈ భవనం భారత చరిత్రలో ముఖ్యమైన సంఘటనలకు సాక్షి గా నిలిచింది. రాజసం ఉట్టిపడే ఈ నిర్మాణం 1880లో ప్రారంభమై 1888లో పూర్తయింది. బ్రిటిష్ ఆర్కిటెక్ట్ హెన్రీ ఇర్విన్ డిజైన్ చేశాడు. మొదటి వైస్రాయ్ లార్డ్ డఫరిన్ 1888 జూలై 23న దీన్ని ఆక్రమించాడు. అప్పట్లో దీని నిర్మాణ ఖర్చు సుమారు 38 లక్షల రూపాయలు.



1888 నుండి 1946 వరకు బ్రిటిష్ వైస్రాయి వేసవి విడిదిగా ఉండేది. స్వాతంత్ర్యానంతరం 1947 నుండి 1960ల వరకు భారత అధ్యక్షుల వేసవి విడిదిగా మారింది. ఇక్కడ 1945, 1946లో భారత విభజనకు సంబంధించిన ముఖ్య



సమావేశాలు జరిగాయి.

**అన్నండేల్:** స్పోర్ట్స్ ప్రియులకు ఇది ఒక ఆదర్శవంతమైన ప్రదేశం. ఇక్కడ క్రికెట్, గోల్ఫ్, హెలికాప్టర్ రైడ్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రాంతం చుట్టూ ఉన్న పచ్చని అడవులు అద్భుతమైన అనుభూతిని ఇస్తాయి.

**టాయ్ ట్రైన్:** కల్కా నుండి సిమ్లా వరకు 96 కిమీ పొడవైన ఈ ట్రైన్ ప్రయాణం మధురానుభూతిగా చెప్పవచ్చు. ఈ ప్రయాణంలో పర్వత సొరంగాలు, పూలు, అడవులు, లోయల రమణీయ దృశ్యాలు తిలకించవచ్చు.

**చద్విక్ జలపాతం:** సిమ్లాకు సమీపంలో ఉన్న ఈ జలపాతం పర్యాటకులకు ప్రశాంతమైన అనుభవాన్ని అందిస్తుంది. ప్రకృతి ప్రేమికులు ఇష్టపడే ప్రదేశం.

**తారాదేవి టెంపుల్:** సిమ్లాకు 11 కి.మీ. దూరంలో ఉన్న ఈ ఆలయం దేవి తారాకు అంకితం. హిమాలయ దృశ్యాలతో కూడిన ఈ ప్రదేశం ఆధ్యాత్మిక శాంతిని అందిస్తుంది.

**సమ్మర్ హిల్:** సిమ్లాకు 5 కి.మీ. దూరంలో ఉన్న ఈ ప్రశాంతమైన ప్రదేశం పచ్చని లోయలు, ప్రశాంత వాతావరణంతో ఆకర్షిస్తుంది. ఇక్కడి హిమాచల్ ప్రదేశ్ విశ్వవిద్యాలయం కూడా సందర్శనీయం.

**కుఫ్రీ:** సిమ్లాకు 16 కి.మీ. దూరంలో ఉన్న కుఫ్రీ మంచు క్రీడలు, స్కీయింగ్, గుర్రపు స్వారీ, సాహస క్రీడలకు ప్రసిద్ధి. కుఫ్రీ ముఖ్యంగా స్కీయింగ్‌కు చాలా ప్రసిద్ధి చెందినది. మహాసు శిఖరం, కుఫ్రీ ఫన్ వరల్డ్ ఇక్కడి ఆకర్షణలు. శీతాకాలంలో ఇది తెల్లని మంచుతో కప్పబడి ఉంటుంది. కుఫ్రిలోని వైల్డ్ లైఫ్ జూలో హిమాలయన్ మోనాల్, యాక్, బ్లాక్ బేర్.. ఇత్యాది జంతువులను చూడవచ్చు.

**గ్రీన్ వ్యాలీ:** సిమ్లా కుఫ్రీ రోడ్డులో ఉన్న ఈ ప్రదేశం దట్టమైన అడవులు, హిమాలయ దృశ్యాలతో పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంది. ఫొటోగ్రఫీ ప్రియులకు ఇది ఒక గొప్ప ప్రదేశం,

శీతాకాలం, మంచు అనుభవం కోసం డిసెంబర్ నుండి ఫిబ్రవరి వరకు, వేసవిలో మార్చి నుండి జూన్ వరకు సిమ్లాను సందర్శించవచ్చు.

సిమ్లాకు 50కి.మీ. దూరానగల చైల్‌లోని క్రికెట్ మైదానం సముద్ర తలానికి 2250 మీటర్ల ఎత్తులో వుంది. ప్రపంచంలో ఇంత ఎత్తైన ప్రాంతంలో వున్న క్రికెట్ మైదానం ఇదేనని పరిశీలకుల అభిప్రాయం. సిమ్లా సమీపాన నార్దెరాలో సముద్ర మట్టానికి 2050 మీటర్ల ఎత్తులో ఒక గోల్ఫ్ కేంద్రం నిర్మించారు. ఇక్కడే ఆర్మీ హెరిటేజ్ మ్యూజియం కూడా ఉంది. 2025 నుంచి హెలికాప్టర్ రైడ్ సౌకర్యం ప్రారంభమైంది. గ్లెన్ ఫారెస్ట్ అనేది ట్రెక్కింగ్, నేచర్ వాక్‌లకు అద్భుతమైన ప్రదేశం. పిక్నిక్, ఫొటోగ్రఫీకి అనువైన చోటు. ఇంకా సిమ్లాలో ఎన్నెన్నో ప్రకృతి అందాలు పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

**– షేక్ అబ్దుల్ హకీం జాని**

వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

సెల్: 9885446501/9885449458



# ఉద్యోగం వస్తుందా?

ఎస్.భూలక్ష్మి, కాకినాడ

ప్రశ్న: ఇంట్లో అనారోగ్య సమస్యలు, గొడవలు ఎక్కువగా అవుతున్నాయి. పెద్ద చదువులు చదివిన తమ్ముడు ఉద్యోగం కోసం ఎదురు చూడటం, ఆర్థిక ఇబ్బందులు మొదలైన సమస్యలున్నాయి. వీటన్నింటికీ మీరే దారి చూపగలరన్న నమ్మకంతో ఈ ఉత్తరం రాస్తున్నాను. తమ్ముడి పుట్టిన తేదీ లేదు... కానీ 1987 సంవత్సరంలో శ్రీరామనవమి మరుసటి రోజు దశమి మధ్యాహ్నం పుట్టినట్లు తెలుసు.

**జవాబు:** మీరు చెప్పిన వివరాల ప్రకారం మీ తమ్ముడి తేది (శ్రీరామనవమి మార్చి 7) మార్చి 8, 1987, దశమి, నక్షత్రం పుష్యమి 4వ పాదం లేదా ఆశ్లేష 1వ పాదం కానీ కావచ్చు. నవగ్రహ ప్రదక్షిణలు ప్రతి సంవత్సరం శనిత్రయోదశినాడు శని దానం, జపం, అభిషేకం చేయించటం వలన మంచి ఫలితాలు పొందవచ్చు.

## ఈ స్థలం ఇంటి నిర్మాణానికి పనికి వస్తుందా?

ప్రశ్న: ఈ స్థలం ఇల్లు కట్టడానికి పనికి వస్తుందా? లేదా? ఈ స్థలానికి దక్షిణ ఆగ్నేయంలో రోడ్డుశూల ఉందని అంటున్నారు. ఈ రోడ్‌శూల మంచిదా? కాదా? తెలుపగలరు.

**జవాబు:** 'దక్షిణ ఆగ్నేయ వీధిచూపు మంచి ఫలితాలనిస్తుంది. తూర్పు ఆగ్నేయ వీధిపోటు మంచి ఫలితాలనివ్వదు. అరవై అడుగుల దక్షిణ భుజానికి ఎన్ని అడుగుల తరువాత, దక్షిణ ఆగ్నేయంలో, ఎన్ని అడుగుల వీధిచూపు తగులుతున్నదో స్పష్టంగా తెలుపలేదు. ఆ కొలతలను బట్టి ఈ వీధిపోటు/చూపు కలిగిన స్థలం ఎలా సవరించుకోవాలో తెలుపవచ్చు.

## ఏమైనా అభ్యంతరమున్నదా?



ప్రశ్న: పటంలో చూపించిన విధంగా 33x50 అడుగుల స్థలం దక్షిణం రోడ్డు, తూర్పు రోడ్డు (వీధిపోటు) ఉన్నది. ప్రస్తుతం నేను ఇక్కడ ఇల్లు కట్టుకోవటానికి ఏమైనా అభ్యంతరం ఉన్నదా? లేదా? ఉంటే ఎలాంటి సమస్యలు లేకుండా సంపూర్ణ వాస్తుతో ఇంటిప్లాను ఇవ్వగలరు.

**జవాబు:** మీ స్థలానికి తూర్పు ఆగ్నేయం వీధిపోటు స్వల్పంగా తగులుతున్నది. తూర్పు ఆగ్నేయ వీధిపోటు వలన చోరాగ్నిభయాలు, మనస్తాపం కలిగే అవకాశం ఉన్నది. అందువల్ల వీధిపోటు తగులుతున్న మేర కంటే మరికొంచెం (దక్షిణ) స్థలాన్ని (దాదాపు 2 అ॥) వీధిలోకి వదిలేసి ప్రహరీగోడ కట్టుకోవలసి ఉంటుంది. ఆ స్థలంలో మీరు వాస్తు ప్రకారం చక్కగా గృహ నిర్మాణం గావించుకొని నివసించవచ్చు. అయితే మిగతా వాస్తు నియమాలన్నీ మామూలుగానే పాటించాల్సి ఉంటుంది. మీకు ఇంటిప్లాను పత్రికా ముఖంగా ఇవ్వటం కుదరదు. వ్యక్తిగతంగా సంప్రదించి నూతన గృహ నిర్మాణాలకు ప్లాను పొందవచ్చు. క్షేత్రం(స్థలం) బాగుంటేనే ప్లాన్స్ ఇస్తుంటాం.

స్థలం బాగా లేకపోతే అక్కడ ఇల్లు కట్టవద్దని చెప్తాం. క్షేత్రమే వాస్తు ప్రకారం బాగా లేనప్పుడు అక్కడ గృహ నిర్మాణం గావించుకొని, నివాసం ఉంటే ఫలితాలు బాగుండవు. కనుక ప్లాన్స్ ఇవ్వబడవు.

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ...............................................

పుట్టిన తేది : ...............................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .................

చిరునామా:...............................................

– మనలో లోపాలే లేవు.. అని అనుకోవడానికి మించిన తప్పిదం మరొకటి లేదు. – కార్లైల్

# కాళిదాసుపై కథనం

భాస్కరభట్ల పద్మనాభం కొన్నేళ్ల క్రితం కాళిదాసుపై చెప్పిన కొన్ని విషయాలలో ఇదొకటి. ఒక బ్రాహ్మణ కుర్రవాడు అందానికి మన్మథుడు. బుద్ధికి బృహస్పతి. గురుకులానికి వెళ్ళి భక్తిశ్రద్ధలతో శుశ్రూష చేసి గురువు వద్ద శాస్త్ర విద్యలు నేర్చుకుంటున్నాడు. ఒకనాడు గురువుగారు ఇంకో విద్యార్థికి పాఠం చెప్తూ వాక్యార్థం తప్పు చెప్పారట, ఏదో పరధ్యానంలో ఉండి. అప్పుడు అక్కడే ఉన్న బ్రాహ్మణకుర్రాడు చటుక్కున అర్థం తప్పన్నాడట గురువుగారితో. దాని మీద గురువుకీ, ఆ శిష్యుడికి మధ్య మాటా మాటా పెరిగింది. "నీ చదువంతా మరిచిపోయి పాముర్డవై గాడిదలు కాచుకుంటూ తిరుగు గాడిదా, గురువునెదిరిస్తావా?" అని గురువుగారు శపించారు.

గురుధిక్కారం ఊరకే పోతుందా? ఆ దెబ్బతో శిష్యుడు లెంపలు వాయించుకుని గురువు గారి కాళ్ళ మీద పడి, అనుగ్రహించమని ప్రాధేయపడ్డాడు. గురువు ప్రసన్నుడై నా శాపం జరగవలసిందే. కొంత కాలం అయ్యాక భార్య వల్ల మంత్రోపదేశం పొంది దేవి అనుగ్రహం వల్ల ఈ గురుధిక్కారం పోయి మహాకవివవుతావు" అని అనుగ్రహించారు.

అంతే! మతిమాలిన దద్దమ్మ అయిపోయాడా కుర్రవాడు. ఆ ఊరూ ఈ ఊరూ తిరుగుతూ ఎవరైనా పిల్చి ఇంత అన్నం పెడితే తిని, వాళ్ళు నీళ్లిస్తే తాగేవాడు. ఏ రచ్చబండ మీదనో, ఏ చాకలి గుడిసెల దగ్గరో నిద్రపోతూ కాలం గుడపుతూ వచ్చాడు. ఓ రోజు ఓ చాకలివాడు ఈ అబ్బాయిని చూసి చూడ్డానికి భలే బాగున్నాడని తన ఇంట్లో ఉంచుకుని గాడిదల సంరక్షణ అలవాటు చేశాడు. రోజూ రేవుకి గాడిదలతో వెళ్ళడం, సాయంకాలం దాకా గాడిదలని పక్క పొలాల గట్ల మీద మేపుతూ ఉండడం, సాయంకాలం కావడంతోనే వాటిని తోలుకుని ఇంటికి రావడం అతని దినచర్య అయింది.

ఒక మిట్టమధ్యాహ్నం... ఎండ దంచేస్తోంది. ఆ సమయంలో ఈ కుర్రాడు ఒక చెట్టెక్కి తాను కూర్చున్న కొమ్మనే ఒక కత్తితో తెగ్గొడుతుంటాడు. అప్పుడు ఆ చెట్టు కింద ఓ బాటసారి పడుకుని ఉంటాడు. కొమ్మ కొట్టే శబ్దానికి ఆ బాటసారి మేల్కొని మీదికి చూస్తాడు. అతనిని చూసి ఆశ్చర్యపోతాడు. "సెబాస్! వీడు తగిన కుర్రాడే. నా కోరిక తీరుతుంది" అనుకుని ఆ కుర్రాణ్ణి చెట్టుపై నుంచి కిందకు దిగమంటాడు. ఎవరేం చెప్తే ఆ పని చెయ్యడం ఒక్కటే తెలిసిన ఆ కుర్రాడు వెంటనే కొమ్మ కొట్టడం ఆపి కిందకు దిగుతాడు. అతనిని పేరు, కులం, ఊరు, గోత్రం మొదలైనవి అడుగుతాడు బాటసారి. అయితే ఆ కుర్రాడు తనకేమీ తెలీదంటాడు. అప్పుడు బాటసారి అతనితో "నీకు మా రాజుగారి కూతుర్ని ఇచ్చి పెళ్ళి చేయిస్తాను" అని అతనిని తనతో రాజుగారి దగ్గరకు తీసుకుపోతాడు.



ఈ బాటసారి ఎవరో కాదు. ఆ దేశపు రాజుగారి కులగురువు. రాజుగారి అమ్మాయికి చదువు చెప్పిన గురువు. విద్య పూర్తి అయ్యాక గురుదక్షిణగా తన కొడుకుని పెళ్ళి చేసుకోమని అడుగుతాడు. కానీ ఆ అమ్మాయి అందుకు నిరాకరిస్తుంది. ఆ క్షణంలోనే గురువు "నువ్వు నా మాట తిరస్కరించావు కదూ! తెలివితేటలు లేని యువకుడితో నీ పెళ్ళి చేయిస్తాను" అని మనసులో అనుకుంటాడు. అనాదిగా రాజవంశాచారం ఏమిటంటే, ఈడు వచ్చిన కన్నెకి వరుణ్ణి తెచ్చి కళ్యాణం జరిపించేది కుల గురువే. ఆ ఆచారం ప్రకారం ఈ గురువు వరుణ్ణి వెదుకుతూ బయలుదేరి ఆ చెట్టు మీద తాను కూర్చున్న కొమ్మని నరుకుతున్న ప్రబల బుద్ధుణ్ణి చూసి తన మాట ఫలించబోతోందని అనుకుని వాణ్ణి రాజుగారి దగ్గరకు తీసుకెళ్ళి ఈ మాటా ఆ మాటా చెప్పి రాజుగారి కూతురికిచ్చి పెళ్ళి చేయిస్తాడు. రాజుగారి కుమార్తె వేసిన కొన్ని ప్రశ్నలకు ఆ భర్త సరిగ్గా జవాబులు చెప్పలేకపోతాడు. దాంతో ఆమె కోపగించుకుని అతనిని తన కథేంటో చెప్పమని బెదిరిస్తుంది. అప్పుడు అతను జరిగినదంతా చెప్తాడు. అతను చెప్పినదంతా విన్న రాజకన్య "సరే! జరిగిందేదో జరిగిపోయింది. నువ్వు భయపడకు" అని తారకమంత్రం చెప్పి "ఊరి వెలుపల ఉన్న కాళికాలయానికి వెళ్ళి లోపల గడియ పెట్టుకుని మంత్ర జపం చేస్తూ ఉండు. కాళికాదేవి అనుగ్రహిస్తుంది" అని చెప్తుంది. అతను తన భార్య చెప్పిన దేవాలయానికి వెళ్ళి మంత్రజపం చేస్తాడు. ఆమె చెప్పినట్టే కాళికాదేవి వచ్చి అతని నాలుక మీద కొన్ని అక్షరాలు రాస్తుంది. అతను తలుపు తెరిచి చూడగా ఎదుట కాళికమ్మవారు కనిపిస్తుంది. ఆ క్షణమే ఆమెను చూసి– "మాణిక్యవీణా ముపలాల యంతీం మదాలసాం మంజుల వాగ్విలాసామ్ మాహేంద్ర నీలద్యుతి కోమలాంగీం మాతంగ కన్యాం మనసా స్మరామి చతుర్భుజే చంద్రకళావతంసే కుచోన్నతే కుంకుమరాగ శోణే పుండ్రేక్షు పాశాంకుశ పుష్పబాణ హస్తే నమస్తే జగదేకమాతః" అంటూ ఓ నాలుగు శ్లోకాలు, శ్యామలాదండకం చెప్తాడు.

అతవెనరో కాదు, సాక్షాత్తు 'కాళిదాసు' నామంతో జగత్ప్రసిద్ధుడైనవాడే. ఇలాంటి విషయాలు అప్పుడప్పుడూ చెప్తూ ఉండేవారు. నిజానికి రాజుగారి కన్య చెప్పిన శ్లోకం ఇత్యాదివి ఈ కథలో చెప్పారు.

– యామిజాల జగదీశ్

# శ్రీకృష్ణుడు నడయాడిన 'కళ్ళుత్తిపర'

లోక సంరక్షణార్థం శ్రీమహావిష్ణువు ధరించిన అనేకానేక అవతారాలలో అత్యంత ప్రత్యేకమైనది విశిష్టమైనది శ్రీకృష్ణావతారం. ధర్మాన్ని గెలిపించడానికి సత్యాన్ని కాపాడటానికి నటనసూత్రధారి చేసిన లీలలు ఎన్నో... ఎన్నెన్నో. ఆయన లీలలు మాదిరి మన దేశంలో పావన క్షేత్రాలలో లీలామానుషరూపుడు కొలువుతీరిన దివ్యధామాలు కూడా లెక్కలేనన్ని.

గోవర్ధనధారి, వేణుగోపాలుడు, రుక్మిణీ సత్యభామా సమేత వాసుదేవుడు, ద్వారకాధీశుడు, జగన్నాథుడు, బృందావన విహారీ.. ఇలా.. అనేక నామాలతో దేవకీనందనుడు దర్శమిస్తున్నారు. దక్షిణ భారతదేశంలో శ్రీకృష్ణుడు కొలువైన క్షేత్రాలలో విశిష్టమైనది కేరళలోని గురువాయూర్.

ద్వాపర యుగంలో రుక్మిణీదేవి ఆరాధించిన మూర్తిని ద్వారక నీట మునిగిన తరువాత వాయుదేవుడు, దేవగురువు తీసికొని వచ్చి ప్రతిష్ఠించడం వలన స్వామిని శ్రీ గురువాయూరప్పన్ క్షేత్రాన్ని గురువాయూర్ అని పిలుస్తారు. మరో విశేషం ఏమిటంటే శ్రీవైష్ణవ క్షేత్రానికి క్షేత్రపాలకుడు పరమేశ్వరుడు. ప్రధాన ఆలయానికి సమీపంలోనే క్షేత్రపాలకుడైన మమ్మియూర్ శ్రీ మహాదేవుడు కొలువైన ఆలయం ఉంటుంది. శ్రీ పార్థసారథి శ్రీ బలరామ క్షేత్రం, శ్రీ ధర్మశాస్త దేవాలయం ఇలా.. మరెన్నో దేవీ దేవతల ఆలయాలు కనపడతాయి గురువాయూర్‌లో.

చుట్టుపక్కల గ్రామాలలో కూడా ఎన్నో పురాతన ప్రత్యేక క్షేత్రాలు కనిపిస్తాయి. శ్రీ విష్ణుమాయదేవిగా ఆరాధించే శ్రీహరికన్యకా భగవతిదేవి కొలువైన ఆలయం గురువాయూర్‌కి సమీపంలో ఉన్న అరియన్నూర్ గ్రామంలో ఉంటుంది. ఈమెను శ్రీ ధర్మశాస్తకు జన్మనిచ్చిన మోహినీ అవతారం అంటారు. వెయ్యి సంవత్సరాల పురాతన ఆలయం. సహజ వర్ణాలతో గీసిన అనేక పురాణ ఘట్టాల చిత్రాలను ఈ ఆలయంలో చూడవచ్చు.

త్రిసూరు నుండి గురువాయూర్ వెళ్లే దారిలో అనేక ఆలయాలు ఉన్నాయి. వాటిలో ఒకటి శ్రీ తెచ్చికొట్టుకావు భగవతి క్షేత్రం. దేవాలయం చాలా ప్రసిద్ధి. అమ్మవారి కన్నా దేవాలయ గజరాజు అరవై యేళ్ల తెచ్చికొట్టుకావు రామచంద్రన్ మరింత ప్రసిద్ధి. ఇతర ఆలయ ఉత్సవాలలో పాల్గొనడానికి రామచంద్రన్‌కు చెల్లించే అద్దె లోల్లో ఉంటుందంటే అర్థం చేసుకోవాలి.



ఇక్కడ ప్రస్తావించవలసిన విషయం శ్రీ గురువాయూరప్పన్‌కు ఉన్న గజ సంపద. ఆలయానికి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న 'పునత్తూర్ కోట లేక ఆనే కోట'లో నివసించే గజాలు సుమారు ఎనభై. ఇవన్నీ శ్రీ గజేంద్ర వరదునికి భక్తులు ప్రేమతో, భక్తితో సమర్పించుకొన్నవి కావడం విశేషం. ఇంత గజసైన్యం ఉన్న ఆలయం మరొకటి భారతదేశంలో లేదు. గురువాయూర్‌కి సమీపంలో ఉన్న కందనశ్శరీలో ఉన్న కళ్ళుత్తిపర శ్రీకృష్ణ భగవతి ఆలయం. మరెక్కడా ఇలాంటి ఆలయాన్ని మనం చూడలేం.

## క్షేత్ర గాథ

ద్వాపర యుగంలో గోపాలుడు ఇక్కడ తన ఆలుమందలతో విహరించేవారట. అదంతా అదృశ్య రూపంలో జరిగేదట. అర్హులైన భక్తులకు, మహర్షులకు గోకులవిహారి దర్శనం లభించేది. వారి ప్రార్థనలకు సంతసించిన బృందావన విహారి తన పాద ముద్రను కొండ మీద ముద్రించారట. అనంతరం స్థానిక పాలకులు ఆలయాన్ని నిర్మించారట.

కానీ పద్దెనిమిదో శతాబ్దానికి చెందిన మైసూరు పాలకుడు టిప్పు సుల్తాను ఈ ప్రాంతాన్ని ఆక్రమించారు. ఆయన సైనికులు ఈ ప్రాంతంలోని ఆలయాలకు నష్టం చేసారని చెబుతారు. ఆ క్లిష్ట పరిస్థితులలో భక్తులు స్వామివారిని కాపాడుకోడానికి ప్రధాన బింబంను పక్కన ఉన్న చిన్న మడుగులో పడవేశారట.

సుమారు రెండు వందల సంవత్సరాల క్రితం నీటిలో ఉన్న బింబాన్ని వెలికి తీసి ఆలయాన్ని నిర్మించారు. బింబం అంటే మూల విరాట్టుకు ప్రతిరూపంగా భావించే ఉత్సవమూర్తి. కొద్ది కాలం క్రితం ఆలయాన్ని మరింత ఆకర్షణీయంగా పునః నిర్మించారు.

## ఆలయ విశేషాలు

ఇలాంటి సుందర ప్రత్యేక ఆలయాన్ని మరెక్కడా చూడలేం. అంత ప్రత్యేకత చూడగానే కనపడుతుంది. ఆంగ్ల 'యు' అక్షరం మాదిరి ఉండే చిన్న కొండ మధ్యలో సహజసిద్ధంగా ఏర్పడిన ప్రదేశంలో తూర్పు ముఖంగా నిర్మించారు మూడు సన్నిధులు. ఊరికి దూరంగా గలగలా ప్రవహించే కాలువలు, ఎఱ్ఱని తామర పూలతో నిండిన చెరువులు, పచ్చటి పొలాల మధ్యలో అత్యంత ప్రశాంత ఆహ్లాదకర పరిసరాలలో రమణీయమైన ఆధ్యాత్మిక సౌరభానికి ప్రతి రూపంలా కనిపిస్తుంది ఈ క్షేత్రం. మరో పక్కన నింగిని తాకే వృక్షాలు, ఏపుగా పెరిగిన వెదురు పొదలు. ప్రకృతి శోభకు నిజరూపంగా ఉంటుంది జగన్నాటక సూత్రధారి కొలువైన ఈ ప్రదేశం.

ఉత్తరం పక్కన ఉన్న ద్వారం నుండి ప్రాంగణంలోనికి వెళితే మొట్ట మొదట శ్రీ నాగదేవతల దర్శనం లభిస్తుంది. మలయాళ పూజా విధానంలో నాగదేవతలకు ప్రత్యేక స్థానం ఉన్నది. ప్రతి ఒక్క దేవాలయంలో నాగదేవతలకు సముచిత స్థానం కనపడుతుంది.

ఆలయ కార్యాలయం దాటిన తరువాత మొదటి సన్నిధిలో శ్రీ భగవతి దేవి కొలువై దర్శనమిస్తారు. పక్కనే ఉన్న మరో సన్నిధిలో శ్రీ వేణుగోపాల స్వామి సుందరమైన స్థానక భంగిమలో నేత్రపర్వంగా దర్శనమిస్తారు. మూడవ సన్నిధిలో మొదటి పూజలు అందుకొనే శ్రీ వినాయకుడు ఉంటారు.

ఏ వైష్ణవ క్షేత్రంలో అయినా అంజనాసుతుడైన శ్రీ ఆంజనేయునికి ప్రత్యేక స్థానం తప్పనిసరిగా ఉంటుంది. ఇక్కడ మరింత ప్రత్యేక స్థానంలో మారుతీ నందనునికి కలిగించారు.



రామదూత ఇక్కడ క్షేత్రపాలకుడు. కానీ ఎలాంటి సన్నిధి ఉండదు. ఒక పక్కన చిన్న గద్దె మీద హనుమంతుని ఆయుధమైన గద ఉంచారు. జితేంద్రుడు ఇక్కడ అదృశ్య రూపంలో సంచరిస్తూ క్షేత్ర రక్షణ చేస్తారని విశ్వసిస్తారు. అన్ని పూజలు గదాయుధానికే చేస్తారు.

ఇలాంటిది త్రిసూర్ జిల్లాలోనే ఉన్న దశరథ నందనుల ఆలయాలలో ప్రముఖమైన త్రిప్రయార్ శ్రీరామ క్షేత్రంలో కూడా కనిపిస్తుంది. పెరియార్ నదీతీరంలో ఉ న్న ఈ ఆలయ ప్రాంగణం మొత్తం కిష్కింద అంటే ఎక్కడైనా రామదూత ఉండవచ్చు అని చెబుతారు. ప్రాంగణానికి పెట్టని కోటలాంటి రక్షణ చిన్న పర్వతం. పైకి వెళ్లవచ్చు. పైనుండి మధ్య లోయలో కనిపించే ఆలయ సముదాయాన్ని వీక్షించడం అపురూప అనుభవం. సన్నటి కొండ పైన శ్రీకృష్ణ బింబాన్ని దాచిన నీటి కొలను చూడవచ్చు. పక్కనే పశువులకు కట్టే పలుపుతాడు గుర్తులు స్పష్టంగా కనిపిస్తాయి. పర్వత పైభాగాన ఒక పక్కన శ్రీ గోపాలకృష్ణుని పాద ముద్ర కనిపిస్తుంది. ఆలయానికి ప్రత్యేకత పేరు తెచ్చింది శ్రీపాదం.

## పూజలు ఉత్సవాలు

ఉదయం అయిదు గంటల నుండి పదకొండు వరకు; తిరిగి సాయంత్రం అయిదు నుంచి రాత్రి ఎనిమిది వరకు భక్తుల దర్శనార్థం తెరిచి ఉండే ఆలయంలో నియమంగా నాలుగు పూజలు ప్రతిరోజు జరుగుతాయి.

శ్రీ వైష్ణవ సంప్రదాయం ప్రకారం గురువాయూర్ ఆలయంలో నిర్ణయించిన ప్రకారం అన్ని ఉత్సవాలు జరుపుతారు. ముఖ్యంగా శ్రీరామనవమి, శ్రీ హనుమజ్జయంతి, దుర్గా నవరాత్రులు ఘనంగా చేస్తారు. శ్రీకృష్ణాష్టమి సంబరాలను అత్యంత విశేషంగా నిర్వహిస్తారు. అదే విధంగా అష్టమి తిథి, రోహిణి నక్షత్రం ఉన్న రోజులలో, తిథి నక్షత్రం రెండూ కలిసి ఉన్న రోజున ఎంతో ఘనంగా పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు.

ఈ విశేష శ్రీకృష్ణ క్షేత్రం గురువాయూర్ పట్టణానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. స్వంత వాహనం లేదా ఆటోలో వెళ్ళాలి. గురువాయూరులో అన్ని రకాల వసతి, భోజన సౌకర్యం అందుబాటు ధరలలో లభిస్తాయి.

## ఎలా వెళ్లాలి?

గురువాయూర్ సమీప నగరం, జిల్లా ప్రధాన కేంద్రం త్రిసూర్. దేశంలోని అన్ని నగరాల నుండి నేరుగా రైలు మార్గంలో చేరుకోవచ్చు. త్రిసూరులో పురాతన ఆలయాలెన్నో ఎన్నాయి. కేరళలోనే కాకుండా దేశ విదేశాలలో ప్రఖ్యాతి గాంచిన 'త్రిసూర్ పూరం' కేరళలో తొలి శివాలయంగా ప్రసిద్ధికెక్కిన శ్రీ వడక్కునాథర్ ఆలయం వద్ద నిర్వహిస్తారు.

– ఇలపావులూరి వెంకటేశ్వర్లు

## 23 నవంబరు, 2025 నుండి 29 నవంబరు, 2025 వరకు



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

### మేషం

ఈ వారం కొత్త బాధ్యతలను స్వీకరిస్తారు ప్రయోజనాలని అందుకుంటారు. ప్రత్యర్థి వర్గం మీద గెలుపు కోసం చేసే ప్రయత్నాలు అను కూలిస్తాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధిని సాధించగలుగుతారు. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి. కోప తాపాలను విడిచిపెట్టి ఎన్నో కొత్త విషయాలను గ్రహించే ప్రయత్నాలు చేస్తారు. కొంతమంది వ్యక్తుల పట్ల మీకున్న అభిప్రాయం పూర్తిగా మారుతుంది.

### వృషభం

ఈ వారం వ్యాపార విస్తరణ కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వ్యాపారంలో లాభాలు రొటేషన్‌ల రూపంలో ఉంటాయి. దూరప్రాంత ప్రదేశాలలో పెట్టుబడులు పెట్టాలన్న ఆలోచనలు ముడిబడతాయి. చేతికి సుబ్రహ్మణ్య పాశుపత కంకణాన్ని ధరించండి. రాజకీయాల్లో ఉన్నవారికి కాలం అనుకూలంగా ఉంటుంది. కొంతమంది ద్వారా పై వాళ్ళతో పైరవీలు జరిపించగలుగుతారు.

### మిథునం

ఈ వారం ఆలోచనలలో మార్పులు ఏర్పడతాయి. కొద్దిపాటి ఒత్తిడిని కూడా భరించలేని పరిస్థితి ఏర్పడుతుంది. కొన్ని కార్యక్రమాల నిమిత్తం మీ పలుకుబడిని పరపతిని ఎంతగానో ఉపయోగిస్తారు చేసే ప్రయత్నాలు సఫలీకృతం అవుతాయి. శ్రీ లక్ష్మీ చందనంతో సుబ్రమణ్య స్వామి వారికి అభిషేకం జరిపించండి. స్నేహితుల ద్వారా నూతన వ్యాపారాన్ని మొదలుపెడతారు.

### కర్కాటకం

ఈ వారం దూరం బంధువుల నుండి ఉచిత సలహాలు అందుకుంటారు. పోటీ పరీక్షల్లో పాల్గొంటారు. ఉన్నత విద్య వైద్య విద్య ప్రభుత్వ ఉద్యోగం కోసం రాసే పరీక్షల్లో విజయం సాధిస్తారు. పరపతి పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు స్నేహాలుగా మారుతాయి. లీజులు లైసెన్సులు కాంట్రాక్టుల కోసం చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి.

### సింహం

ఈ వారం కొత్త వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ప్రతి ఒక్క విషయాన్ని ఎంతో జాగ్రత్త శ్రద్ధతో నేర్చుకుంటారు, అవలంబిస్తారు. నూతన ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. షార్ట్ టర్మ్ ఉద్యోగాలు, కాంట్రాక్టు ఉద్యోగాలు అందుకో గలుగుతారు. పరిమళ గంధం నిత్య దీపారాధన కుందిలో 2 చుక్కలు వేసి, దీపారాధన చేయండి. కొంతమంది సహాయము తీసుకోవడం ఇష్టం లేక కొన్ని ముఖ్యమైనటువంటి విషయాలకు దూరంగా ఉంటారు.

### కన్య

ఈ వారం నూతన వస్తువులు వస్త్రాలు కొనుగోలు చేస్తారు. ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా గాని రాజకీయాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. గోమతి చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరాన్ని చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. కొన్ని పదవుల కోసం ప్రయత్నం చేయాలని భావిస్తారు. కొత్తగా పరిచయమైన వ్యక్తులకు ఇట్టి విషయాలను తెలియనివ్వవద్దు.

### తుల

ఈ వారం కోర్టు వివాదాలు వాయిదా రూపంలో ఉంటాయి. ఎప్పటికప్పుడు మంచి వార్తను వినగలుగుతామను కోవటం నిరాశకు గురవటం జరుగుతుంది. కాలక్షేపం కోసం కొన్ని కోర్సులు ప్రారంభిస్తారు. వస్త్ర వ్యాపారస్తులు వినూత్నమైన ఆలోచనలు ప్రచారాలు కలిసి వస్తాయి. చేతికి కుబేర కంకణాన్ని ధరించండి లక్ష్మీ కటాక్షం ఏర్పడుతుంది. కుటుంబంలో ఒకరి ఆదాయం పెరగటం మానసిక సంతోషానికి ఆనందానికి కారణం అవుతుంది.

### వృశ్చికం

ఈ వారం బ్యాంకు రుణాల గురించి అధికంగా ఆలోచిస్తారు.వాహనం నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండండి. ఎదుటివారి నిర్లక్ష్యం మనకు ప్రమాదంగా మారవచ్చు. వృత్తిరీత్యా ప్రోత్సాహకరమైన పరిస్థితులు ఏర్పడతాయి. పాత వాహనం అమ్మి వేసి కొత్త వాహనాన్ని కొనుగోలు చేయాలని ఆలోచనలు కలుగుతాయి. పూజల్లో నాగ సింధూరం కుంకుమను ఉపయోగించండి. నూతన పరిచయాలు చిగురిస్తాయి.

### ధనస్సు

ఈ వారం ఇతరులను మెప్పించి మీ పనులు సానుకూల పరచుకుంటారు. అదృష్టం కలిసి వస్తుంది. ఒక ఆహ్వానానికి, ప్రకటనకు లేదా ఉత్తరానికి మీరు ప్రతిస్పందిస్తారు. తలపెట్టిన కార్యం జయం అవుతుంది. అష్టమూలికా తైలంతో లక్ష్మీ తామర వత్తులతో దీపారాధన చేయండి. కార్యాలయంలో నూత నోత్సాహంతో శ్రమించి మంచి ఫలితాలు సాధిస్తారు. సాంకేతిక లోపం వలన మీకు అందవలసిన సమాచారం సకాలంలో మీకు చేరకపోవచ్చు.

### మకరం

ఈ వారం ఆశించినా శుభవార్త వినగలుగుతారు. స్వల్ప ప్రయోజనాల కోసం పెద్ద స్థాయి పరిచయాలను ఉపయోగిస్తారు మీ వారి కోసం కొన్ని చెయ్యక తప్పనటువంటి పరిస్థితులు ఏర్పడతాయి. అష్టమూలిక తైలంతో లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయండి. పెళ్లి సంబంధాల కోసం చేసే ప్రయత్నాలు అంతంత మాత్రంగా ఉంటాయి. కొంతమంది చేసే ప్రచారాలు మీకు నచ్చవు వాస్తవాలకు అతీతంగా ఉన్నవాటిని మీరు ఆమోదించారు.


### కుంభం


ఈ వారం తాత్కాలికంగా ఏర్పడుతున్న అవాంతరాలను పరిగణలోనికి తీసుకొనక పోవడం మంచిది. ఇంట్లో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. వాహన సౌఖ్యం ఏర్పడుతుంది. అదనపు ఆదాయ మార్గాలు లభిస్తాయి. అయితే ఇది తాత్కాలికమైనవి అయివుంటాయి. ఊహాజనితమైన మాటలతో మిమ్మల్ని నమ్మించడం కష్టతరమని ఇతరులు తెలుసుకోగలుగుతారు. పూజలలో మరియు ఇంట్లో నాగబంధం అనే కుంకుమను ఉపయోగించండి, ఇది ఎంతో విశిష్టమైనది.

### మీనం

ఈ వారం శుభకార్యాది విషయ వ్యవహారాలు ఇంట్లో ప్రస్తావిస్తారు. దీనికి తగిన సమాధానాన్ని మీ యొక్క అభిప్రాయాన్ని వెనువెంటనే తెలియజేయవలసిన పరిస్థితి నెలకొంటుంది. ప్రేమ పట్ల మీకు ఉన్న అభిప్రాయాన్ని తెలిజేస్తారు. అష్టమూలిక తైలంతో లక్ష్మీ తామర వత్తులతో దీపారాధన చేయండి. ఎంతగానో ఆలోచింది ఒక వ్యాపారానికి శ్రీకారం చుడతారు. మంచి మార్పులు మనోధైర్యానికి కారణం అవుతుంది.

# ఈ వారం కార్టూన్స్


చీటికి మాటికి మనోభావాలు దెబ్బ తింటే ఎలారా?!


అమెరికా 'వీసా' కోసమేనా?!
షుగర్, ఒబెసిటీ ఉంటే నో వీసా
డా॥ మధు మోహన్. షుగర్ స్పెషలిస్ట్


మీకు దుర్వార్త మహారాణీ!..రాజుగారు మళ్ళీ యుద్ధం గెలిచారు... మీకు ఇంకో సవతిని తెస్తున్నారు!!





ఉనాకోట్‌లోని
కొండలపై ఉన్నాయి ఈ
శిల్పాలు. లెక్కకు మిక్కిలిగా వున్న
ఈ శిల్పాలను చూడాలంటే రెండు
కళ్లు చాలవంటే అతిశయోక్తి కాదు!
త్రిపుర పర్యటనకు వెళ్లిన పర్యాటకుల
లిస్టులో ఈ ప్రదేశం
ఉంటుంది.

